ఎంఈఓ పై అనుచిత ప్రవర్తనపై పీఆర్‌టీయూ టీఎస్ ఖండన





PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

తెలంగాణ ఉద్యమకారులకు
ఇచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వాలి




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 260 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 14 సెప్టెంబర్ 2026



వినాయక చవితి పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున రేపు మంగళవారం సంచిక వెలువడదు. తిరిగి పునర్ దర్శనం బుధవారం

# ఐక్యంగా ఉంటేనే మీకు కోటా.. వాటా..

- సీఎంలంతా గల్లాపెట్టె రోశయ్యకే.. ఇచ్చారు.. గాంధీజీ మీ వాడే: రేవంత్
- ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన
- సీఎం మాటల్లోనే కఠినత్వం..
- చేతల్లోనూ ఉంటే ఎంతో మంది జైలుకెళ్లేవారు: టీజీ వెంకటేశ్






**హైదరాబాద్,13 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆర్యవైశ్యులం తా సమైక్యంగా ఉండాలని, పోటీ ప్రపంచంలో సవాళ్లను ఎదు ర్కోవ డానికి సిద్ధం కావాలని సీఎం రేవంత్ అన్నారు. సమయ స్ఫూర్తితో రాజకీయాల్లో కోటా, వాటా దక్కించుకోవాలని సూచిం చారు. అందరూ ఒక్కతాటిపై నడిస్తే వారిని గౌరవించనివారు ఉండరని పేర్కొన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, 'ఆర్యవైశ్యుల్లో చాలా మంది పేదలు ఉంటారు. కానీ, వారు తమ పేదరికాన్ని కడుపులో దాచుకొని.. సమాజంలో గౌరవం, ఆత్మాభిమానంతో బతుకుతారు. సౌమ్యంగా ఉంటారు' అని అన్నారు. బ్యాంకులు, ఇతర సంస్థలు ఏదైనా ఆస్తిని తనఖా పెట్టనిదే రుణం ఇవ్వవని, కానీ.. ఊరిలో ఉన్న ఏ పేదవాడు వచ్చినా తినడానికి అవసరమైన వస్తువులను ఆర్యవైశ్యులు ఉదారంగా ఇస్తారని తెలిపారు. మిగతా2లో...




## కీలక ఖనిజాలను ఆయుధాలుగా మార్చొద్దు


- బ్రిక్స్ సభ్యదేశాలకు ప్రధాని మోడీ హెచ్చరిక
- నిబంధనలను పాటించడం కాదు.. మనమే రూపొందించాలని సూచన
- స్టార్టప్ ఇన్నొవేషన్ ఫండ్ ఏర్పాటుకు ప్రతిపాదన

## పల్నాడు జిల్లాలో విషాదం .. పిడుగుపాటుకు నలుగురు మృతి




## చైనా మరో ఘనత

- అంతరిక్ష మౌలిక వసతుల్లో రెండో స్థానం
- టాప్-10లో భారత్‌కు చోటు




## పదవి అలంకారమే..ప్రజల కోసం పనిచేస్తా...

- బర్తరఫ్ చేసినందుకు కాదు.. అకారణంగా తొలగించినందుకే బాధ
- కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం..తూర్పులో మళ్ళీ నేనే గెలుస్తా
- ఎమ్మెల్సీ బస్వరాజ్ పై తీవ్ర వ్యాఖ్యలు
- కొండా మురళికి చైర్మెన్ పదవి వచ్చే అవకాశం : మాజీ మంత్రి కొండా సురేఖ
- రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం
- 24 డివిజన్‌లలో కార్పొరేటర్లను గెలిపించుకుంటాం : కొండా మురళీ



**వరంగల్, సెప్టెంబరు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసినందుకు బాధ లేదని, అకారణంగా తొలగించినందుకే బాధగా ఉందని మాజీ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారం వరంగల్ బస్టాండ్ సమీపంలోని ఎంకే నాయుడు హోటల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం మాజీ కార్పొరేటర్ కత్తెరశాల వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కొండా సురేఖతో పాటు ఆమె భర్త మురళి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. కొండా సురేఖ మాట్లాడుతూ నవీన్ ఎప్పుడూ మిగతా2లో...

## మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్






## మెగా డీఎస్సీలో భారీ స్కామ్..

- కూటమి సర్కారుపై వైఎస్ జగన్ మళ్లీ ఫైర్

**అమరావతి, సెప్టెంబరు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** టీడీపీ ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ స్కామ్ జరిగిందంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మరోసారి మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు. ఓ అభ్యర్థి విషయంలో జరిగింది సరైన, పారదర్శక విధానమేనా..? అని ముఖ్యమంత్రి చంద్రబాబును మిగతా2లో...

## ప్రభుత్వ దవాఖానల్లో రోబోటిక్ సర్జరీ సేవలు

- వైద్యారోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ



**హైదరాబాద్, 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానల్లో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఆదివారం సనత్‌నగర్ టిమ్స్‌లో రాష్ట్రస్థాయి మల్టీస్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్‌షాప్ ప్రారంభించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొం దించిన మెడికల్ రోబోటిక్ ఎక్విప్‌మెంట్, మౌలిక వసతుల ను పరిశీలించారు. వైద్య రంగంలో రోబోటిక్ సర్జరీ సేవలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ.. రాష్ట్రంలో ఆధునిక వైద్యసేవల విస్తరణకు మిగతా2లో...

## పండుగ రోజే విచారణకు పిలుపు!

- కేటీఆర్ పీఏ, పీఆర్వోకు పోలీసుల నోటీసులు
- రేవంత్ సర్కార్ కక్షపూరిత ధోరణికి ఇదే నిదర్శనం




## 2029 కల్లా ఎన్డీయే రాష్ట్రాల్లో యూసీసీ అమలు

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వచ్చే లోక్‌సభ (2029) ఎన్నికల లోపు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే రాష్ట్రాల్లో యూసీసీ (ఉమ్మడి పౌరస్మృతి)ని అమలుజేయబోతున్నట్టు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. బీజేపీ పాలనలో ఉన్న 21 రాష్ట్రాల్లో యూసీసీని ప్రవేశపెడుతామని తెలిపారు. ఆదివారం మిగతా2లో...

# ఐక్యంగా ఉంటేనే మీకు కోటా.. వాటా..

(మొదటి పేజీ తరువాయి)

ఏ గ్రామమైనా, బస్తీ అయినా ప్రశాంతంగా ఉందన్నా, పేదవాడి ఆకలి తీరుతుందన్నా.. ఎలాంటి తనఖా లేకుండా ఆర్యవైశ్యులు అప్పులు ఇవ్వడం వల్లేనన్నారు. "పేదవాడి ఆకలి తీర్చడాన్ని మీరు బాధ్యతగా భావిస్తారు. పేదలతో మీకు ప్రత్యేక అనుబంధం ఉంటుంది. ఊరిలో అందరూ మీ వద్దకు వచ్చి సాధక బాధకాలు చెబుతారు. మీ సలహా కూడా అడుగుతారు. వ్యాపారంలో ఎన్ని ఒడిదొడుకులు, ఆటుపోట్లు ఎదురైనా ఎలా అధిగమించాలో ఆర్యవైశ్యులకు తెలుసు. నేనెప్పుడూ మీ శ్రేయోభిలాషినే" అని రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని, మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు గల్లాపెట్టె పెత్తనం వారికే ఇచ్చారని చెప్పారు. తమ సొమ్ము కంటే జాగ్రత్తగా, పొదుపుగా వ్యవహరించడంతోపాటు.. ఆర్థిక వ్యవస్థను అదుపులో పెట్టి అద్భుతంగా పదవులు నిర్వర్తించారని తెలిపారు. **ధనిక రాష్ట్రంలో రోశయ్య పాత్ర..** 2014 జూన్ 2న రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఆవిర్భవించిందంటే.. 16 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రోశయ్య ఆర్థిక మంత్రిగా ఉండడమూ ఒక కారణమని సీఎం రేవంత్ అన్నారు. సీఎంలు మారినా.. ఆర్థిక మంత్రిగా రోశయ్యను కొనసాగించడం చూస్తేనే ఆర్థిక వ్యవహారాల్లో ఆర్యవైశ్యులు ఎంత నిక్కచ్చిగా ఉంటారో తెలుస్తోందన్నారు. రోశయ్యను మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా చేసి కాంగ్రెస్ పార్టీ గౌరవించిందని తెలిపారు. "2007లో నేను మొదటిసారి శాసనమండలికి వెళ్లినప్పుడు కొన్ని విషయాలపై దూకుడుగా మాట్లాడితే.. సభ ముగిసిన అనంతరం రోశయ్య పిలిపించుకొని ఆవేశం తగ్గించుకొని.. అనుభవం తోడు చేసుకొని మాట్లాడితే రాజకీయాల్లో మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు.దీర్ఘకాలిక రాజకీయాలు ఎలా చేయాలో అలవరుచుకుంటే.. తిరుగులేని నాయకుడిగా ఎదుగుతావు అని నన్ను మొదట గుర్తించింది రోశయ్యే' అని రేవంత్‌రెడ్డి చెప్పారు. రోశయ్యతో అసెంబ్లీలో సంవాదం నడిచేదని, ఆయన విమర్శలు చురకలా ఉండేవని, ఎవరినీ దూషించేవారు కాదని అన్నారు. రాష్ట్రం విడిపోయినా.. ఆయన మర్యాదను, గౌరవాన్ని కాపాడాలనే ఉద్దేశంతో నగరం నడిబొడ్డున స్థలం కేటాయించి విగ్రహం పెట్టామని తెలిపారు. అయితే ఏపీకి చెందిన రోశయ్య విగ్రహం హైదరాబాద్‌లో ఎలా పెడతారంటూ చాలా మంది విమర్శలు చేశారని అన్నారు. కానీ, "ఓ సమావేశంలో రోశయ్య మాట్లాడుతూ తాను ఆ గ్రామం నుంచి, ప్రాంతం (ఏపీ) నుంచి అన్నీ అమ్ముకొని బల్కంపేటకు వచ్చి నాలుగు దశాబ్దాలు అయిందని చెప్పారు. తాను హైదరాబాదీనే అని, మంచైనా, చెడైనా ఇక్కడేనని అన్నారు" అని సీఎం రేవంత్ వివరించారు.**ప్రపంచస్థాయి నాయకుడు మీ వాడే..** సాధారణంగా జిల్లా, ప్రాంతం, రాష్ట్ర, దేశ నాయకులను చూస్తామని, కానీ.. ప్రపంచ స్థాయి నాయకుడు ఒకే ఒక్కడు మహాత్మా గాంధీ అని సీఎం రేవంత్ అన్నారు. భారతదేశం నుంచి ప్రపంచ స్థాయి నాయకుడు ఎవరనే చర్చ వస్తే.. అది ఆర్యవైశ్యుల బిడ్డ గాంధీ అని చెప్పాల్సిందేనన్నారు. మహాత్మాగాంధీ కాంగ్రెస్ పార్టీ అని, జాతీయ అధ్యక్షుడిగానూ ఆయన బాధ్యతలు నిర్వర్తించారని చెప్పారు. ఇక ఏఐసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన సీతారాం కేసరి, ఉమ్మడి ఏపీలో పీసీసీ అధ్యక్షుడిగా రోశయ్య, కేంద్ర హోంమంత్రిగా సేవలందించిన నంధ్యాలకు చెందిన పెండెకంటి వెంకటసుబ్బయ్య ఆర్యవైశ్యులేనని గుర్తు చేశారు.లాలా లజపతిరాయ్, సీతారాం కేసరి, పొట్టి శ్రీరాములు వంటి గొప్ప వ్యక్తులు ఆర్యవైశ్య సమాజం నుంచి ఉన్నారని గుర్తు చేశారు.

దేశ స్వాతంత్ర్యం, సమగ్రత కోసం మహాత్మాగాంధీ ప్రాణాలిస్తే.. ఏపీ సాధనకు పొట్టి శ్రీరాములు అమరులయ్యారని కొనియాడారు. ఆర్భాటం, ప్రచారాలకు దూరంగా ఉండడం వల్ల ఆర్యవైశ్యులకు తగిన గుర్తింపు రాలేదన్నారు. ఆర్యవైశ్యుల పట్ల తమ ప్రభుత్వానికి విశ్వాసం, నమ్మకం ఉందని చెప్పారు. 'మీరు ఐక్యంగా ఉంటే మాకందరికీ కూడా మీకు ఇవ్వాల్సిన తప్పని పరిస్థితి వస్తుంది' అని సీఎం అన్నారు.

# కీలక ఖనిజాలను ఆయుధాలుగా మార్చొద్దు

**న్యూఢిల్లీ : సెప్టెంబరు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కీలక ఖనిజాలను ఆయుధాలుగా మారిస్తే అభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతాయని ప్రధాని నరేంద్ర మోడీ బ్రిక్స్ సభ్యదేశాలను హెచ్చరించారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనప్పటికీ వాటిని తట్టుకొని నిలబడే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు. న్యూఢిల్లీలోని భారత మండపంలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో ఆయన ఆదివారం ప్రసంగిస్తూ 'సాంకేతిక తను, కీలక ఖనిజాలను ఆయుధాలుగా మార్చడం మన పురోగతికి ఆటంకం కలిగిస్తుంది. అందుకే సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడంలో మేము అందరినీ కలుపుకొని వెళతాం' అని చెప్పారు. ప్రపంచంలో ఉద్రిక్తతలు నిరంతరం పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ అవి సాధారణ ప్రజల జీవితాలపై ప్రతికూ ల, విస్తృత ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. **సంక్షోభాలు ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కావడం లేదు** మహమ్మారులు, వాతావరణ విపత్తులు, సరఫరాలకు అంతరాయాలు...ఇలా ఏ సంక్షోభం ఎదురైనా అది ఒకే ప్రాంతానికి పరిమితం కావడం లేదని ప్రధాని అన్నారు. 'అందువల్లనే కష్టాలను తట్టుకొని నిలబడే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ప్రాధాన్యత ఇచ్చాము. సవాళ్లను సకాలంలో గుర్తించడం, వాటికి సిద్ధమవడం, తక్షణ చర్యలు తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. అంటు వ్యాధుల నివారణ కోసం బ్రిక్స్‌లో ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ఏర్పాటుపై అంగీకారం కుదిరింది. హెచ్చరికల డేటాకు సంబంధించిన మార్గదర్శకాలను సిద్ధం చేశాము. బ్రిక్స్ సహకార వ్యవస్థ మన సరఫరాలను మరింత విశ్వసనీయంగా మారుస్తుంది' అని ఆయన వివరించారు. ప్రపంచ సంక్షోభాల నివారణ కోసం నిర్ణయాలు తీసుకోవడంతో గ్లోబల్ సౌత్ దేశాలు వెనుకబడుతున్నాయని చెప్పారు. ఈ దేశాలు నిబంధనలను పాటించేవిగా ఉండకూడదని, వాటిని రూపొందించేవిగా ఎదగాలని ఆకాంక్షించారు. అభివృద్ధి కోసం కృషి చేసే సమయంలో పర్యావరణానికి హాని కలిగించవద్దని మోడీ సూచించారు. **మానవాభివృద్ధి, పర్యావరణం మధ్య సమతుల్యత అవసరం** మానవాభివృద్ధి, పర్యావరణం మధ్య సమతుల్యతను కాపాడుకోవాల్సిన అవసరముందని ప్రధాని నొక్కిచెప్పా రు. సుస్థిరతకు ఇదే పునాది అని,ఆ దిశగా భారత్ అనేక కార్యక్రమాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. స్మార్ట్ గ్రిడ్లు, ఇంధన నిల్వకోసం బ్రిక్స్ డిజిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను స్థాపించామన్నారు. బ్రిక్స్‌కు అధ్యక్షత వహిం చి ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత,స్థితిస్థాపకత అనే నాలుగంశాలపై తమ ప్రయత్నాలను కేంద్రీకరించామని, సభ్యదేశాల సహకారం, మద్దతుతో ఉమ్మడి దృక్పథాన్ని అందరికీ ప్రయోజనకరమైన సహకారంగా మార్చగలగడం తనకు సంతోషాన్ని కలిగించిందని మోడీ చెప్పారు.**సహకారంలో అందరినీ భాగస్వాములను చేయాలి** ఆవిష్కరణల విభాగంలో బ్రిక్స్ ఇంక్యుబేటర్ వ్యవస్థ సభ్యదేశాల స్టార్టప్‌లు, ఇంక్యుబేటర్లను అనుసంధానిస్తుందని మోడీ తెలిపారు. వినూత్నమైన, విస్తరించదగిన పరిష్కారాలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నొవేషన్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు.


# పదవి అలంకారమే..ప్రజల కోసం పనిచేస్తా...

(మొదటి పేజీ తరువాయి)

స్థానికంగా ఉండాలనేవాడని, ఇప్పుడు అతని కోరిక తీరిందని, ప్రజల మధ్య ఉండి అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామన్నారు. మేం నమ్మిన వైఎస్ కోసం గతంలో మంత్రి పదవికి రాజీనామా చేశామన్నారు. కొందరు వార్డు మెంబర్ పదవికి కూడా రాజీనామా చేయడం లేదన్నారు. ఎప్పుడూ అధికార పార్టీకి రాజీనామా చేసి ప్రతిపక్ష పార్టీలో చేరేవారమన్నారు. గతంలో కొందరు గుంట నక్కలు మాకు టికెట్ దక్కకుండా చేశాయన్నారు. కాంగ్రెస్ లో టికెట్ రాకపోతే కేసీఆర్ పిలిచి మంత్రిని ఓడించడానికి వరంగల్ తూర్పులో పోటీ చేయాలని చెప్పారన్నారు. అందుకే పరకాల నుంచి వచ్చి ఇక్కడ పోటీ చేసి యాభై వేల పైచిలుకు మెజారిటీతో గెలిచానని గుర్తుచేశారు. వరంగల్ తూర్పులో మేం గెలిచినందుకే ప్రజలు ప్రశాంతంగా ఉన్నారన్నారు. కొండా మురళీ ఉన్నారనే ధైర్యంతో ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఆయన తమ్ముడు, కొడుకు భూకబ్జాలు చేశారని, షాపుల్లో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కార్పొరేటర్ గా గెలవలేనోడు నా రాజీనామా కోరుతున్నాడని ఎద్దేవా చేశారు. 32 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎంపీపీ నుంచి మంత్రి వరకు ఎన్నో రాజకీయ ఒడిదుడుకులను ఎదుర్కొని ఎదిగానన్నారు. బరిలో నిలిచిన ప్రతి చోట మురళీ వెనుక ఉండి నడిపించారన్నారు. ఇప్పుడు అవకాశవాద రాజకీయాలు ఎక్కువయ్యాయని, ఏ సమయంలో ఏ పార్టీలో ఉంటారో తెలియడం లేదన్నారు. కొండా దంపతులు కాంగ్రెస్ ను వీడి వేరే పార్టీల్లో చేరుతున్నారని మీడియాలో కథనాలు వస్తున్నాయని వాటిని నమ్మొద్దని పార్టీలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. మళ్లీ వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానన్నారు. డీలిమిటేషన్ జరిగితే తప్ప ఆమెనే పోటీ చేస్తానన్నారు. రాహుల్ లక్ష్యం బీసీలను అభివృద్ధి చేయాలనేనని తెలిపారు. కొండా మురళీకి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మెన్ పదవి వచ్చే అవకాశం ఉందని సురేఖ సూచనప్రాయంగా తెలిపారు. పరకాల నియోజక వర్గంలోని తండాల్లో రూ. 7.50 కోట్లతో రోడ్ల నిర్మాణానికి జీఓ తెచ్చానన్నారు. **రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం..: కొండా మురళీ** రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యమని, కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్సీ, సురేఖ భర్త కొండా మురళీ తెలిపారు. పదవులు వస్తాయి, పోతాయని, కానీ, మాట మీద నిలబడాలన్నారు. 24 డివిజన్ లలో కార్పొరేటర్లను గెలిపించుకుంటామన్నారు. ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు రాజీనామా చేస్తున్నావని స్వామి గౌడ్ అడిగారని, నచ్చకపోవడం వల్లే అని చెప్పి రాజీనామా చేశానన్నారు. నా మాట, సురేఖ మాట ఒక్కటే ఉంటుందని, నా బిడ్డ మాట మాత్రం వేరన్నారు. ఎక్కడన్నా కొండా మురళీ భూ కబ్జాలు చేశాడని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. కార్యకర్తలే మా బలం, మా ఊపిరి అన్నారు. **కొండా సురేఖకు మంత్రి పదవి ఇవ్వాలి : వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు** కొండా సురేఖకు మళ్లీ మంత్రి పదవి ఇవ్వాలని వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. బీసీ మహిళా నేతను బర్తరఫ్ చేయడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మీసాల ప్రకాష్, నవీన్ రాజ్, మాజీ కార్పొరేటర్లు చింతాకుల అనిల్, కేడెల పద్మ, దామోదర్ యాదవ్, భోగి సువర్ణ ప్రవీణ్, బస్వరాజ్ కుమార్, బత్తిని వసుంధర, నాగపురి కల్పన, వీరగోని రాజ్ కుమార్, ముజీబ్, అక్తర్ పాల్గొన్నారు.

# పండుగ రోజే విచారణకు పిలుపు!

**హైదరాబాద్, సెప్టెంబరు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రేవంత్ సర్కార్ క క్షపూరిత ధోరణి పరాకాష్టకు చేరింది. సోమవారం వినాయక చవితి రోజున పోలీస్ విచారణకు హాజరుకావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ, పీఆర్వోకు సైఫాబాద్ పోలీ సులు నోటీసులు ఇవ్వడమే అందు కు నిదర్శనం. ఈ నెల 7న అసెంబ్లీ మూడో గేట్ వద్ద జరిగిన ఘటనలపై కేటీఆర్ పీఏ మహేందర్‌రెడ్డి, పీఆర్వో మహేశ్‌పై కేసు నమోదైంది.వారు హైకోర్టును ఆశ్రయించడంతో మ ధ్యంతర బెయిల్ మంజూరు చేసి వి చారణకు సహకరించాలని సూచించింది. పనిదినాలను కాదని పండుగరోజే విచారణకు పిలువడం అనుమానాలకు తావిస్తున్నది. సోమవారం ఉదయం 10 గంటల కు సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పీఏ మహేందర్‌రెడ్డి, పీఆర్వో మహేశ్ విచారణకు హాజరుకానున్నారు. రేవంత్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇదే విపరీత ధోరణి అవలంబిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# చైనా మరో ఘనత

**బీజింగ్ సెప్టెంబరు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :**అంతరిక్ష రంగంలో వేగంగా దూసుకెళ్తున్న చైనా మరో కీలక ఘనత సాధించింది. ప్రపంచ అంతరిక్ష మౌలిక వసతుల నిర్మాణంలో రెండో స్థానంలో నిలిచింది. తాజా అంతర్జాతీయ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. అమెరికా అగ్రస్థానంలో ఉండగా, జపాన్, రష్యా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, భారత్, ఇటలీ, నెదర్లాండ్స్ తదుపరి స్థానాల్లో నిలిచాయి. భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థతో అంతరిక్ష మౌలిక వసతులు మరింతగా మమేకం కానుండటంతో.. రాబోయే దశాబ్దంలో ఈ రంగం ప్రపంచ భౌగోళిక-రాజకీయ, సాంకేతిక పోటీకి ప్రధాన వేదికగా మారనుందని నివేదిక పేర్కొంది.బీజింగ్‌లో జరిగిన 2026 చైనా అంతర్జాతీయ సేవల వాణిజ్య ప్రదర్శన సందర్భంగా 2026 గ్లోబల్ స్పేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెస్‌మెంట్ః నివేదికను విడుదల చేశారు. అంతరిక్షంలోని వివిధ ప్రాంతాల మధ్య అనుసం ధానానికి అవసరమైన మౌలిక వసతుల ఆధారంగా ప్రపంచంలోని 48 ఆర్థిక వ్యవస్థలను ఈ నివేదిక అంచనా వేసింది. అంతరిక్ష మౌలిక వసతుల అంచనాలో హార్డ్‌వేర్‌తోపాటు సాఫ్ట్‌వేర్ అంశాలనూ పరిగణనలోకి తీసుకున్నారు. జీవన సహాయక వ్యవస్థలు, ప్రయోగ-రవాణా వ్యవస్థలు, సమాచార వ్యవస్థలు, ఇంధన వనరులు, చట్టాలు, నిబంధనల వివాదాల పరిష్కార యంత్రాంగాలు వంటి కీలక అంశాలను పరిశీలించారు.

## పల్నాడు జిల్లాలో విషాదం .. పిడుగుపాటుకు నలుగురు మృతి

**అమరావతి: సెప్టెంబరు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏపీలోని పల్నాడు జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై నలుగురు మృతి చెందారు. ఏపీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోటు ఈదురుగాలులు, పిడుగుల పడుతున్నాయి.నరసరావుపేట నియోజకవర్గంలో పిడుగుపాటుతో నాగమ్మ, వెంకాయమ్మ, వెంకటయ్య, చిన్న కోటేశ్వరావు అనే నలుగురు మృతి చెందారు. ఈ ఘటనలో మూడు ఆటోలు,కొబ్బరి, మామిడి చెట్లు దెబ్బతిన్నాయి .

## మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**అమరావతి, సెప్టెంబరు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :**వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా జరుపుకోవాలని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. దేశ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని దైవ స్వరూపంగా భావించి.. నదులు, వృక్షాలు, పర్వతాలు, జీవరాశులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని పేర్కొన్నారు. తొలి పూజలందుకునే వినాయకుడి అర్చనలో ఉపయోగించే పత్రి, పుష్పాలు వృక్ష సంపదతో, ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని చాటుతాయని అన్నారు.**పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు..** వినాయకచవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజలకు పిలుపునిచ్చారు. సంప్రదాయబద్ధంగా మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని సూచించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

## మెగా డీఎస్సీలో భారీ స్కామ్..

(మొదటి పేజీ తరువాయి)

జగన్ నిలదీశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పలు ప్రశ్నలు సంధించారు.జగన్ తన పోస్టులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఒక అభ్యర్థికి 65 టెట్ మార్కులు వచ్చాయి. ఏడు దశల వెరిఫికేషన్ తర్వాత ఉద్యోగం కేటాయించారు. అయితే ఆ తర్వాత అదే అభ్యర్థి అనర్హుడని డీఈవో నిర్ధారించారని తెలిపారు. అలాంటప్పుడు ఆ ఏడు దశల వెరిఫికేషన్‌లో ఏం జరిగిందని ప్రశ్నించారు. తనకు ఉద్యోగం ఎలా వచ్చిందో తెలియదని అభ్యర్థే చెప్పిన విషయాన్ని కూడా జగన్ ప్రస్తావించారు.విమర్శలు వెల్లువెత్తిన తర్వాత ఆ అభ్యర్థికి 2018 టెట్‌లో 77 మార్కులు వచ్చాయని అధికారులు చెప్పడంపై జగన్ సందేహాలు లేవనెత్తారు. ఆ మార్కులు ముందే ఉంటే.. డీఈవో ఎందుకు అనర్హుడని ప్రకటించారని ప్రశ్నించారు. అంతేకాకుండా ఆ 77 మార్కులు ఎస్‌జీటీ పోస్టుకు అవసరమైన పేపర్-1-A కు బదులుగా, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పేపర్-11-B లో వచ్చాయని, అయినా ఎలా అర్హత కల్పించారని నిలదీశారు.2018 టెట్ స్కోర్‌తోనే ఉద్యోగానికి అర్హత ఉంటే ఆ అభ్యర్థి 2025లో మళ్లీ టెట్ ఎందుకు రాశారని జగన్ ప్రశ్నించారు. ఇన్ని మలుపుల తర్వాత ఈ నియామక ప్రక్రియను పారదర్శకంగా జరిగిందని చెప్పగలరా..? అని అన్నారు. ఇది డీఎస్సీ స్కామ్‌ను ప్రోత్సహించడం కాదా..? అని ప్రశ్నించారు. దీనికి చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని జగన్ డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ దవాఖానల్లో రోబోటిక్ సర్జరీ సేవలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నట్టు తెలిపారు. వైద్యరంగంలో బ్రాండ్‌గా విస్తరించేందుకు టిమ్స్, కొత్తగా ఉస్మానియా దవాఖానలు నిర్మిస్తున్నామని, మెడికల్ కాలేజీలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. రోబోటిక్ సర్జరీ పితామహుడు డా.సుధీర్ శ్రీవాత్సవ సేవలను ఉపయోగించు కుంటున్నామని తెలిపారు. 'రాష్ట్రంలోని ఎంఎన్‌జే, టిమ్స్‌లు, ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, వరంగల్ సూపర్ స్పెషలిటీ దవాఖానలతోపాటు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని జీజీహెచ్‌లలో అడ్వాన్స్‌డ్ రోబోటిక్ సర్జరీ సేవలను విస్తరించేందుకు కృషిచేస్తున్నామని చెప్పారు.

## 2029 కల్లా ఎన్డీయే రాష్ట్రాల్లో యూసీసీ అమలు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మీడియాతో మాట్లాడుతూ ట్రిపుల్ తలాక్ రద్దు, క్రిమినల్ న్యాయ వ్యవస్థలో మార్పులు, జాతీయ భద్రత సహా పలు అంశాలను ప్రస్తావించారు. కేంద్రంలోని మోదీ సర్కార్ ఉగ్రవాదం పట్ల 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తున్నట్టు చెప్పారు.మణిపూర్‌లో ఎన్‌ఆర్‌సీపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ముస్లిం మహిళలకు సమాన హక్కులు కల్పించేందుకు ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశామని అన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో యూసీసీని ప్రవేశపెట్టామని, 2029 లోక్‌సభ ఎన్నికల లోగా బీజేపీ నేతృత్వంలోని 21 రాష్ట్రాలు యూసీసీని స్వీకరిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. భారతీయ న్యాయ సంహిత ద్వారా ప్రభుత్వం ఈ వ్యవస్థను బలోపేతం చేసిందన్నారు. జాతీయ భద్రతపై మాట్లాడుతూ, 370 రద్దు రక్తపాతం లేకుండా జరిగిందన్నారు. మతంతో సంబంధం లేకుండా పౌరులందరికీ ఒకే విధమైన వ్యక్తిగత చట్టాలను వర్తింపజేయటమే 'యూసీసీ'.

## రాష్ట్ర ప్రజలకు సిఎం రేవంత్ వినాయక చవితి శుభాకాంక్షలు



**హైదరాబాద్, సెప్టెంబరు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలోని విఘ్నాలను తొలగించి అందరికీ ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం ప్రసాదించాలని ముఖ్యమంత్రి విఘ్నేశ్వరుడుని ప్రార్థించారు. వాడ వాడల వెలిసే గణేష్ మండపాలలో భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించుకోవాలని కోరారు. ఈ గణపతి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను సిఎం ఆదేశించారు. ఈ సంవత్సరం కూడా వినాయకుని మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నదని చెప్పారు.

# ఎంఈఓ పై అనుచిత ప్రవర్తనపై పీఆర్‌టీయూ టీఎస్ ఖండన

**20 మంది వచ్చి నినాదాలు చేయడం దురదృష్టకరమని ఆవేదన**

**వర్క్ అడ్జస్ట్మెంట్ పై రగిలిన వివాదం**

**మండల అధ్యక్ష కార్యదర్శులు పాకాల రమేష్, చాంద్ సాహెబ్**






**కల్లూరు, సెప్టెంబరు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు మండలంలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ విషయంలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) కార్యాలయంలో చోటుచేసుకున్న పరిణామాలపై పీఆర్‌టీయూటీఎస్ కల్లూరు మండల శాఖ తీవ్రంగా స్పందించింది. పాఠశాలల పనివేళల్లో బోధనకు ఆటంకం కలగకుండా కేవలం నలుగురు సంఘ బాధ్యులు మాత్రమే చర్చకు రావాలని ఎంఈఓ సూచించినప్పటికీ, సుమారు 20 మంది వచ్చి పెద్దగా నినాదాలు చేస్తూ వాదనకు దిగడం దురదృష్టకరమని పిఆర్టియు టీఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు పాకాల రమేష్, చాంద్ సాహెబ్ అన్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా విద్యాశాఖాధికారి ఈ నెల 8న జారీ చేసిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులపై వివరణ కోరేందుకు టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ఈ నెల 11న ఎంఈఓ కార్యాలయానికి వెళ్లారు. ఉదయం 10.30 గంటలకు నలుగురు బాధ్యులు మాత్రమే రావాలని ముందుగా సూచించినప్పటికీ సుమారు 11 గంటల సమయంలో దాదాపు 20 మంది ఎంఈఓ పొదిలి పద్మ ఉన్న కార్యాలయానికి చేరుకున్నారని పీఆర్‌టీయూటీఎస్ తెలిపింది. వర్క్ అడ్జస్ట్‌మెంట్ తమకు అనుకూలంగా ఉండేలా చేయాలని గట్టిగా మాట్లాడుతూ వాదనకు దిగారని, నినాదాలు, గట్టిగా అరుపులతో కార్యాలయ వాతావరణం ఉద్రిక్తంగా మారడంతో అక్కడున్న విద్యార్థులు సైతం భయాందోళనకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారితో మాట్లాడి, మూడు రోజుల సెలవుల అనంతరం ఈ నెల 17న పూర్తి వివరాలు తెలియజేస్తానని ఎంఈఓ చెప్పినప్పటికీ పరిస్థితి సద్దుమణగలేదని పిఆర్టియు నాయకులు తెలిపినారు. వాస్తవ పరిస్థితులను నమోదు చేసుకునేందుకు ఎంఈఓ మొబైల్‌లో వాయిస్ రికార్డింగ్ చేస్తుండగా, కొందరు ఆమె అనుమతి లేకుండా ఫోన్ తీసుకుని రికార్డింగ్‌ను తొలగించారని పీఆర్‌టీయూటీఎస్ ఆరోపించింది. అనంతరం నినాదాలు చేస్తూ వెళ్లిపోయారని పేర్కొంది. ఆ తర్వాత ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద టెంట్ ఏర్పాటు చేసి ధర్నా నిర్వహించారని తెలిపింది. **మహిళా అధికారిపై అనుచిత ప్రవర్తన సరికాదు**మండల విద్యాశాఖ కార్యాలయ విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించడం, అధికారిక వ్యవహారాల్లో అనవసర ఒత్తిడి తీసుకురావడం సరికాదని పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ పేర్కొంది. తమ సంఘానికి చెందిన సీనియర్ సభ్యురాలైన ఎంఈఓ పట్ల జరిగిన పరిణామాలపై విచారం వ్యక్తం చేస్తూ, సంఘటనను తీవ్రంగా ఖండించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన సూచనలు ఇవ్వడంతో పాటు బాధ్యులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను పిఆర్టియు మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు పాకాల రమేష్ చాంద్ సాహెబ్ కోరారు.

# భక్తితో పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

**వినాయక విగ్రహాల తయారీలో రసాయనాల ముప్పు**

**రంగుల కోసం విషతుల్య పదార్థాల వినియోగం..**

**నిమజ్జనంతో నీటి, పర్యావరణ కాలుష్యం ద్వారా ప్రజారోగ్యం పై ప్రభావం**

**మట్టి విగ్రహాల వైపు మొగ్గు చూపాలంటున్న గుడ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోట పుల్లయ్య**

**కల్లూరు, సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వినాయక చవితి సందర్భంగా ప్రతియేటా వేలాది విగ్రహాలు తయారై పూజలందుకుంటునాయి. కానీ విగ్రహాల తయారీకి వాడే పదార్థాలు, వేసే రంగులు, నిమజ్జనం రోజు నీటిలో కలిసే రసాయనాల వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి సమస్యగా మారుతోందని గుడ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోట పుల్లయ్య అన్నారు. ముఖ్యంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలు,కృత్రిమ రంగులు మరింత ప్రమాదకరమన్నారు. **విగ్రహాల తయారీకి ఏమి వాడతారు?** గతంలో సంప్రదాయంగా వినాయక విగ్రహాలను సహజ మట్టితో తయారు చేసేవారు. ప్రస్తుతం పెద్ద విగ్రహాలను తక్కువ సమయంలో తక్కువ బరువుతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఫైబర్, సింథటిక్ పదార్థాలను ఉపయోగిస్తున్నారు. విగ్రహాలకు మెరుపు, ఆకర్షణీయమైన రంగులు ఇవ్వడానికి సింథటిక్ పెయింట్లు,వార్నిష్‌లు,గ్లిట్టర్ వంటి పదార్థాలను వాడతారు. రంగుల్లో ఉపయోగించే పదార్థాలపై ఆధారపడి సీసం, క్రోమియం, కాడ్మియం, పాదరసం వంటి భార లోహాలు ఉండే అవకాశం ఉంది. అయితే ప్రతి విగ్రహంలో ఇవన్నీ తప్పనిసరిగా ఉంటాయని కాదు. ఉపయోగించే పెయింట్, తయారీ విధానాన్ని బట్టి రసాయనాల స్వభావం మారుతుంది. **నిమజ్జనంతో నీటి కాలుష్యం** విగ్రహాల నిమజ్జనం అనంతరం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పూర్తిగా కరిగిపోదు. పెయింట్లలోని రసాయనాలు మరియు ప్లాస్టిక్ అలంకరణలు నీటిలో మిగిలిపోవడం వల్ల చెరువులు, సరస్సులు, కాలువలు, నదుల్లో కాలుష్యం పెరిగే ప్రమాదం ఉంది. నీటిలో రంగులు, భారీ లోహాలు చేరితే నీటి నాణ్యత, జలచర జీవులకి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. నిమజ్జనం తర్వాత మిగిలే పూలు, ప్లాస్టిక్, థర్మాకోల్, ఇతర అలంకరణ వ్యర్థాలు సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. **ప్రజల ఆరోగ్యం పైన ప్రభావం** కొన్ని పెయింట్లలో ఉండే భార లోహాలు అధిక మోతాదులో పర్యావరణంలోకి చేరి మనుషులు, జంతువులు, జలచరాలకు హానికరంగా మారవచ్చు. ముఖ్యంగా కలుషితమైన నీరు తాగడం, ఆ నీటితో పండించిన ఆహారం తీసుకోవడం ద్వారా కాలుష్య పదార్థాలు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. అలాగే విగ్రహాల తయారీ సమయంలో దుమ్ము, పెయింట్ ఆవిరులు, రసాయనాలతో ప్రత్యక్షంగా పనిచేసే కార్మికులకు చర్మం, కళ్లకు, శ్వాసకోశానికి ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. **మట్టి విగ్రహాలే పరిష్కారం** భక్తి శ్రద్ధలతో పూజించడంతో పాటు ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. సహజ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలు, సహజ రంగులతో అలంకరించిన విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని కాపాడిన వాళ్ళం అవుతాం. ప్లాస్టిక్, థర్మాకోల్ అలంకరణలను తగ్గించి, సహజ సిద్ధమైనవి పునర్వినియోగించగల పదార్థాలను ఉపయోగించాలి. వీలైతే కృత్రిమ నిమజ్జన కుంటలను ఏర్పాటు చేసి, నిమజ్జనం అనంతరం వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించే చర్యలు చేపట్టడం వల్ల కొంతవరకు మేలు జరగవచ్చు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడమే నిజమైన బాధ్యత. మట్టి వినాయకుడిని పూజిద్దాం.. స్వచ్ఛమైన నీటిని, ఆరోగ్యకరమైన భవిష్యత్తును కాపాడుకుందాం.

# తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వాలి

**ఖిలా వరంగల్ నుంచి కళాకారులు, ఉద్యమకారుల గళం.. ప్లకార్డులతో నిరసన**




**వరంగల్, సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, కళాకారుల సమస్యలను పరిష్కరించి, వారికి ప్రభుత్వం ప్రకటించిన హామీలను అమలు చేయాలని బహుజన సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బికే బొడ్డు కుమారస్వామి కోరారు. తెలంగాణ ఉద్యమకారులు, కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ పడమరకోట అమరవీరుల స్థూపం వద్ద డప్పు చప్పుళ్లు, ఉద్యమ గీతాలు, తెలంగాణ నినాదాలు, ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బికే బొడ్డు కుమారస్వామి మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం ఉద్యమ సమయంలో కళాకారులు ప్రజల్లో చైతన్యం కలిగించడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వం ప్రకటించిన హామీలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమ కారులు, కళాకారుల సమస్యలపై చేపడుతున్న కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారుడు, న్యాయవాది తీగల జీవన్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన కేకే కమిటీని స్వాగతిస్తున్నామని, అదే సమయంలో ఉద్యమకారులు, కళాకారులకు న్యాయం జరిగేలా గుర్తింపు ప్రక్రియ స్పష్టంగా, పారదర్శకంగా సాగాల్సిన అవసరం ఉందన్నారు. హామీల అమలులో అనవసర జాప్యం లేకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఆరు గ్యారంటీల్లో భాగంగా ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులకు ఇస్తామని ప్రకటించిన హక్కులు, సౌకర్యాలను అమలు చేయాలని కోరుతున్నామని ఆయన తెలిపారు. తాము కొత్తగా ఏదీ కోరడం లేదని, ప్రభుత్వం గతంలో ప్రకటించిన హామీలనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు.ఖిలా వరంగల్ జేఏసీ కన్వీనర్ నాగవెల్లి సాంబయ్య మాట్లాడుతూ.. నిజమైన ఉద్యమకారులు, కళాకారులకు నష్టం కలగకుండా ప్రభుత్వం గుర్తింపు ప్రక్రియను చేపట్టాలని కోరారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉద్యమకారుల సమస్యలపై దృష్టి సారించాలని అన్నారు. (సి పి యు ఎస్ ఐ), దళిత బహుజన శ్రామిక విముక్తి (డి బి ఎస్ వి) వరంగల్ జిల్లా కమిటీ నాయకులు గడ్డం శరత్ మాట్లాడుతూ.. ఉద్యమ కారులు, ఉద్యమ కళాకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. పోలేపాక యాదగిరి ప్రసాద్, బొలిశెట్టి అశోక్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యపరిచిన కళాకారులకు గుర్తింపు కల్పించాలని కోరారు.అనంతరం ఉద్యమకారులు మాజీ కార్పొరేటర్ ఉమా దామోదర్ యాదవ్‌ను ఆమె నివాసంలో కలిసి, ఉద్యమకారుల జాబితాతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. తమకు గుర్తింపు కల్పించి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఉమా దామోదర్ యాదవ్.. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఉద్యమకారులు, కళాకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ. కార్యక్రమంలో సుధమల్ల అశోక్, ఈర్ల సాంబయ్య, నమిండ్ల కుమారస్వామి, గొర్రె కోటేశ్వర్, నల్లిగంటి ప్రభాకర్, కాగితాల భాస్కర్, మైదం సుహాసిని, గద్దల వసంత, సాల్మన్, చరణ్, సాగర్, కృష్ణ, సాబిన్, కారిమోహన్ తదితర ఉద్యమకారులు, కళాకారులు పాల్గొన్నారు. కళాకారులు ఆలపించిన ఉద్యమ గీతాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# 12వ డివిజన్‌లో తాగునీటి సమస్యకు పరిష్కారం..

**● HDPE పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్.. ● 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 13(పిసి డబ్ల్యూ న్యూస్):** నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నిరంతర తాగునీటి సరఫరా అందించడమే లక్ష్యంగా కరీంనగర్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్‌లో 15వ ఆర్థిక సంఘం 30 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న HDPE పైప్‌లైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. డివిజన్ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పైప్‌లైన్ నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు.నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా మెరుగుపడేలా ఎణ్రాజు పైప్‌లైన్ నిర్మాణం చేపట్టడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, స్థానిక డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, నగర పాలక సంస్థ అధికారులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ 48వ డివిజన్‌లో మట్టి వినాయకులను పంపిణీ చేసిన బిజెపి నేత అప్పాల శ్రీనివాస్..







**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 13(పిసి డబ్ల్యూ న్యూస్):** పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వెస్ట్ జోన్ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి అప్పాల శ్రీనివాస్ పేర్కొన్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కరీంనగర్ నగరంలోని 48వ డివిజన్‌లో స్థానిక ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను ఆయన పంపిణీ చేశారు. అప్పాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జలవనరులు, మట్టి కలుషితమై పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడుకోవడంతో పాటు మన సాంప్రదాయాలను సమున్నతంగా నిలుపుకునేందుకు మట్టి వినాయకుల పూజ ఉత్తమమైన మార్గమని తెలిపారు. పర్యావరణహిత వేడుకలను జరుపుకోవడానికి ప్రజలంతా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన బిజెపి మైనార్టీ మోర్చా నేత ఎండి ముజీబ్



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** విఘ్నేశ్వరుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు వర్ధిల్లాలని బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు ప్రత్యేకంగా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎండి ముజీబ్ మాట్లాడుతూ, సకల విఘ్నాలను తొలగించే ప్రథమ పూజ్యుడు వినాయకుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకున్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కులమతాలకు అతీతంగా పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, సమాజంలో సోదరభావం, శాంతి, ఐక్యత మరింత వర్ధిల్లాలని విఘ్నేశ్వరుని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని, పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# ఘనంగా శివసేన అధ్యక్షుడు డా. గణేష్ గౌటే జన్మదిన వేడుకలు

**- లయన్స్ అభయ బంజారా ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం**






**హైదరాబాద్, సెప్టెంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** శివసేన పార్టీ అధ్యక్షుడు డాక్టర్ గణేష్ గౌటే జన్మదిన వేడుకలను లయన్స్ అభయ బంజారా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ రాజేంద్రప్రసాద్, లయన్ చంద్రశేఖర్, పీఆర్వో లయన్ రాఘవేంద్ర (అడ్వకేట్), లయన్ పీఎస్ఎన్ రాజులతో పాటు డాక్టర్ గణేష్ గౌటే, స్వప్న గౌటే, తేజస్విని గౌటే, విష్ణువర్ధన్ గౌటే తదితరులు పాల్గొని పేదలకు స్వయంగా ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 'మానవ సేవే మాధవ సేవ' అనే భావనతో ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పుట్టినరోజుల వంటి ప్రత్యేక సందర్భాల్లో ఆడంబరాలకు పోకుండా, ఆపన్నులకు అండగా నిలిచే సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం డాక్టర్ గణేష్ గౌటేకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి..

## అధికారులకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశం

**కరీంనగర్, సెప్టెంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** సర్ ప్రక్రియను అధికారులు సిబ్బంది పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో ఒక్క అనర్హుడికి చోటు లేకుండా.. ఒక్క అర్హుడి పేరు గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాను దోషరహితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (SIR-2026) ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల పరిశీలనలో ఏమాత్రం పొరపాట్లకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.ఓటర్ల జాబితాలో గుర్తించిన వ్యత్యాసాలు, అన్‌మ్యాప్డ్ ఓట్లు, ఇతర మార్పులకు సంబంధించి సంబంధిత ఓటర్లకు అవసరమైన నోటీసులను వెంటనే అందజేయాలని బిఎల్ఓలను ఆదేశించారు. నోటీసుల అనంతరం చేపట్టే క్షేత్రస్థాయి విచారణలను పారదర్శకంగా నిర్వహించి, సంబంధిత నివేదికలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. జిల్లాలో రెండు లక్షల 70 వేల మందికి దరఖాస్తులు అందించాల్సి ఉండగారు 2,24,263 మంది ఓటర్లకు నోటీసులు అందించామని తెలిపారు.. దాదాపు లక్ష మంది వరకు నోటీసులకు సమాధానాలు ఇచ్చినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును నిర్ధారించుకునేందుకు ఎన్నికల సంఘం గమనిక లో సూచించిన గుర్తింపు కార్డులను అధికారులకు సమర్పించాలన్నారు.**దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు** కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం-6, ఓటర్ల జాబితాలో పేరు తొలగింపు లేదా ఆక్షేపణలకు ఫారం-7, పేరు, చిరునామా తదితర వివరాల మార్పులు, సవరణలకు ఫారం-8 ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. నిబంధనల ప్రకారం వాటిని పరిష్కరించి, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రచార దినాల్లో స్వీకరించిన దరఖాస్తులను కూడా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నుంచి అందిన దరఖాస్తులు, అభ్యర్థనలు, సవరణలకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు.**బిఎల్ఓల పనిపై క్రాస్ వెరిఫికేషన్** బిఎల్ఓ, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా



పర్యటిస్తూ బిఎల్ఓ లు నిర్వహించిన పనులను క్రాస్ వెరిఫికేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల వివరాల పరిశీలన, అన్‌మ్యాప్డ్ ఓట్ల గుర్తింపు, నోటీసుల జారీ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి దశలోనూ పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అలసత్వం లేదా నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.**ప్రతి ఓటరూ జాబితాను పరిశీలించుకోవాలి** ఓటర్ల జాబితా సవరణలో అధికారుల పాత్రతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన యువతతో పాటు ప్రతి ఓటరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని కోరారు. పేరు, చిరునామా, ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు లేదా మార్పులు ఉంటే వెంటనే ఎన్నికల సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు.కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6, పేరు తొలగింపు లేదా ఆక్షేపణలకు ఫారం-7, వివరాల మార్పులు, సవరణలకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులను సమర్పించు కోవచ్చని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండటం.. అనర్హుల పేర్లు తొలగించడం.. నమోదైన వివరాల్లో తప్పులు లేకుండా చూడటమే సర్ ప్రక్రియ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే దోషరహిత, పారదర్శక ఓటర్ల జాబితా సాధ్యమవుతుం దని, అందుకు ఓటర్లు కూడా తమ వివరాలను పరిశీలించుకుని సహకరించాలని కోరారు. సర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇదే స్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని అట్టి ప్రకటన లో వెల్లడించారు.

# పర్యావరణహిత గణేష్ ఉత్సవాలకు మట్టి విగ్రహాల వినియోగం..

**కరీంనగర్, సెప్టెంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 137గా ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 70 మందికి పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ అలగండుల మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల కారణంగా నిమజ్జనం సమయంలో నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు.మట్టి విగ్రహాలు నిమజ్జనం అనంతరం సహజంగా కరిగిపోయి తిరిగి మట్టిలో కలిసిపోతాయని, అందువల్ల ప్రజలు పర్యావరణహిత విగ్రహాలనే ఎంచుకోవాలని ఆయన సూచించారు. పండుగల సమయంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. డిస్ట్రిక్ట్ 137గా







ఆధ్వర్యంలో గతంలోనూ పర్యావరణ పరిరక్షణ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రీన్ పోస్టర్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించడంతో పాటు 1,200 మొక్కలను నాటినట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో కూడా పచ్చదనం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.అలాగే సార్వజనిక గణేష్ ఉత్సవాల చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో లోకమాన్య బాల గంగాధర్ తిలక్ 1893లో మహారాష్ట్రలో సార్వజనిక గణపతి ఉత్సవాలను ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారని తెలిపారు. ఈ సంప్రదాయం దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు. డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, డాక్టర్ జి.ఎం. కిరణ్, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ అశోక్, డాక్టర్ శ్రీనివాస్ అలగండుల, డాక్టర్ సౌమ్య, డాక్టర్ సాయి మేఘన, డాక్టర్ సాయి ప్రీతం తదితరులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ. శ్రీనివాస్, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, జిల్లా గవర్నర్ కొంజర్ల మహేశ్, టి.వి. రావు, బండిపల్లి వెంకటరమణ, హుజురాబాద్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ మనోజ్, ప్రసాద్, సాగర్ రెడ్డి, పులాల శామ్, నాగేశ్వర్, కుమారస్వామి, వెంకన్నతో పాటు వాసుదేవ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల వేళ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

● సికింద్రాబాద్ జోన్ సెంట్రల్ పీస్ కమిటీ



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని సికింద్రాబాద్ జోన్ పరిధిలోని గణేష్ మండపాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణపై సెంట్రల్ పీస్ కమిటీ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించింది. నగరంలో ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, మతసామరస్యంతో నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు అధికారులు, పీస్ కమిటీ ప్రతినిధులు ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. మండపాల వద్ద భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ డీసీపీ ఎం.ఎస్. రక్షితా కృష్ణమూర్తి ఐపీఎస్, అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ శశాంక్ రెడ్డి, గాంధీనగర్ ఏసీపీ యాదగిరి, ఓయూ ఏసీపీ జగన్ తో పాటు జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు. అలాగే సెంట్రల్ పీస్ కమిటీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శరత్ శ్యామ్, మాజీ ఏజీపీఏ అబ్దుల్ కబీర్, ఉపాధ్యక్షులు ఫరీదుద్దీన్ యూనుస్, మాడపు చంద్రశేఖర్, డాక్టర్ యూసుఫ్ హమీది, కన్వీనర్ సయ్యద్ ఖలీద్ షా చిస్తీ, సభ్యులు శ్రీలత, బసంతి కౌర్, మల్లం రమేష్, అరఫాత్, మొహమ్మద్ అలీ, జహంగీర్, తదితరులు హాజరయ్యారు.

# పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మట్టి గణపతుల పంపిణీ..

### నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ..

### తీగలగుట్టపల్లి మేయర్ క్యాంప్ కార్యాలయంలో విగ్రహాలు పంపిణీ చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్..

**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని 2వ డివిజన్ తీగలగుట్టపల్లిలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు. అదేవిధంగా 22వ, 50వ డివిజన్ల పరిధిలోని చైతన్యపురి కాలనీలో, 14వ డివిజన్ చింతకుంటలో నిర్వహించిన ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాల్లోనూ మేయర్ పాల్గొని ప్రజలకు విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజించాలని కోరారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు



తోడ్పడటంతో పాటు చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులు కాలుష్యానికి గురికాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. రసాయనాలు, ఇతర హానికర పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల ప్రజలు పర్యావరణానికి హాని కలిగించని మట్టి గణపతులనే వినియోగించాలని సూచించారు. "పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత. మట్టి గణపతుల ప్రతిష్టాపనతో పచ్చని కరీంనగర్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి" అని మేయర్ పిలుపునిచ్చారు. నగరంలోని అన్ని డివిజన్లలో మట్టి గణపతి విగ్రహాలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని మేయర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పర్యావరణహితమైన వినాయక చవితిని జరుపుకోవాలని కోరారు. కరీంనగర్‌ను పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకుంటూనే ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని మేయర్ సూచించారు. కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, గడ్డి ప్రదీప్, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.



# బోగిరి స్వప్నబాలకృష్ణ దంపతుల గారాల పట్టి జన్మదిన వేడుకలు ఘనంగా!

### - రంగురంగుల బెలూన్లు.. కేక్ కటింగ్.. కుటుంబ సభ్యుల ఆనందోత్సాహాల చిన్నారి పుట్టినరోజు వేడుకలు



**ఏటూరునాగారం, సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో బోగిరి స్వప్నబాలకృష్ణ దంపతుల గారాల పుత్రిక జన్మదిన వేడుకలు అత్యంత ఆనందోత్సాహాల ఘనం గా నిర్వహించారు. తమ ముద్దుల కుమార్తె పుట్టినరోజును పురస్కరించుకుని కుటుంబ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి వేడుకలను సంతోషంగా జరుపుకున్నారు. చిన్నారి పుట్టినరోజు వేడుకలతో ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. తమ గారాల పుత్రిక పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు చిన్నారిని అందంగా అలంకరించి, రంగురంగుల బెలూన్లు, ఆకర్షణీయమైన అలంకరణల వేడుకలను నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుట్టినరోజు కేక్‌ను చిన్నారి కట్ చేయడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. చిన్నారి కేక్ కట్ చేసిన సమయంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు చప్పట్లతో శుభాకాంక్షలు తెలియజేస్తూ వేడుకలను మరింత సందడిగా మార్చారు. చిన్నారి చిరునవ్వులు, తల్లిదండ్రుల ఆప్యాయతలు, కుటుంబ సభ్యుల సంతోషం జన్మదిన వేడుకలు ఎంతో ప్రత్యేకంగా నిలిచాయి. తమ గారాల పుత్రిక ఎదుగుదలను చూస్తూ బోగిరి స్వప్నబాలకృష్ణ దంపతులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. తమ కుమార్తె జీవితంలో ఈ పుట్టినరోజు మరపురాని మధుర జ్ఞాపకంగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. పుట్టినరోజు వేడుకల్లో కుటుంబ సభ్యులు చిన్నారితో కలిసి ఆనందంగా గడిపారు. బంధుమిత్రులు చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. చిన్నారి భవిష్యత్తు బంగారుమయం కావాలని, విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తమ కుమార్తె పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యుల సమక్షంలో ఆనందంగా జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు. చిన్నారి జీవితంలో ప్రతి పుట్టినరోజు ఇలాగే ఆనందాన్ని నింపాలని, ఆమె అడుగడుగునా విజయాలు సాధించాలని కోరుకున్నారు. బోగిరి స్వప్నబాలకృష్ణ దంపతుల గారాల పట్టికి జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. చిన్నారి చిరునవ్వులు ఎల్లప్పుడూ ఇలాగే వెలుగులు నింపాలని, జీవితాంతం ప్రేమానురాగాలు, ఆనందం, విజయాలతో వర్ధిల్లాలని మీడియా టుడే మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తోంది. హ్యాపీ బర్త్‌డే చిన్నారి! నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలి!

# పర్యావరణ హితంగా వినాయక చవితి నిర్వహించాలి

- మట్టి విగ్రహాలనే పూజిద్దాం.. డీజేలకు దూరంగా ఉందాం
- పర్యావరణ పరిరక్షణ అభివృద్ధి మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రంగయ్య పిలుపు



**హైదరాబాద్, సెప్టెంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):**వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణానికి హాని కలగకుండా సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని పర్యావరణ పరిరక్షణ అభివృద్ధి మండలి (ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సిహెచ్. రంగయ్య భక్తులకు పిలుపునిచ్చారు. విగ్రహ ప్రతిష్ఠాపన మొదలుకొని నిమజ్జనం పూర్తయ్యేంత వరకు ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడేలా వ్యవహరించాలని కోరారు.ఆదివారం ఆయన హైదరాబాద్‌లో మాట్లాడుతూ రసాయనాలతో కూడిన విగ్రహాలకు బదులుగా మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించి భారతీయ సంస్కృతిని, ప్రకృతిని కాపాడాలని సూచించారు. శబ్ద కాలుష్యానికి కారణమయ్యే డీజేలకు దూరంగా ఉండాలని, మండపాల్లో భక్తి పాటలు, ఆధ్యాత్మిక భజనలతో నవరాత్రుల శోభను ఇనుమడింపజేయాలని నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు.సాధ్యమైనంత వరకు ఇళ్ల వద్దే బకెట్లు, కృత్రిమ తొట్టెల్లో నిమజ్జనం పూర్తి చేసుకోవాలని రంగయ్య సూచించారు. నిమజ్జనం పేరిట చెరువులు, నదులు, ఇతర సహజ నీటి వనరులను కలుషితం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా నిమజ్జన ఏర్పాట్లు జరిగేలా అధికార యంత్రాంగం కూడా తగిన చర్యలు చేపట్టాలని, అధికారులు, భక్తులు, ఉత్సవ నిర్వాహకులు సమన్వయంతో పనిచేసి పండుగను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

- పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాల పంపిణీ చేసిన కాటేపల్లి
- 100 మంది ఆటో డ్రైవర్లకు ఖాకి చొక్కాల పంపిణీ





**కల్లూరు, సెప్టెంబర్13 (పిసిడబ్ల్యూ న్యూస్)** :పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ఆర్యవైశ్య నాయకులు కాంగ్రెస్ నాయకులు కాటేపల్లి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెంటర్ వద్ద ఆదివారం వినాయక భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. రసాయనాలతో తయారుచేసిన విగ్రహాల వాడకం వల్ల పర్యావరణం కలుషితం అవుతుందని అందులో భాగంగా పర్యావరణ కలుస్తాన్ని తగ్గించేందుకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి సహకారంతో 100 మంది ఆటో డ్రైవర్లకు ఖాకి చొక్కాలు పంపిణీ చేశారు. వినాయక చవితి పండుగ సందర్భంగా మండల ప్రజలకు ఉప ముఖ్యమంత్రి భట్టి మంత్రి పొంగులేటి, తుమ్మల, ఎంపీ రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఇరిగేషన్ శాఖ చైర్మన్ మువ్వా విజయబాబు తరపున వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శీలం కృష్ణారెడ్డి, ఆళ్ళకుంట నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్లు యాస శ్రీకాంత్, ఖమ్మంపాటి వీరస్వామి, గుండ్ల పుల్లారావు, ఏనుగు సత్యంబాబు, పెద్దబోయిన శ్రీనివాసరావు, కర్నాటి అప్పిరెడ్డి, వేము దినాకర్, తోట సుబ్బారావు, గిద్దె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరికీ వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు

**- పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



**ఖమ్మం, సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :**వినాయక చవితి పండుగను పురస్కరించుకొని జిల్లా ప్రజలందరికీ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో వినాయక చవితి వేడుకలను నిర్వహించుకోవాలని,పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ,మట్టి గణేష్ విగ్రహాలను వినియోగిద్దాండపర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను జరుపుకుందామన్నారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

# తలసేమియా చిన్నారులకు 'సంకల్పం ఆపన్నహస్తం'

**ఖమ్మంలో డాక్టర్ దండమూడి రమణ బృందం మానవీయ సేవలు**

**ఉచిత వైద్య పరీక్షలతో చిన్నారుల ఆరోగ్యానికి వైద్యుల భరోసా..**







**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రక్తం తక్కువై ప్రాణంపోతున్న పసిమొగ్గల్లో ఆశల వెలుగులు నింపేందుకు, వారి శ్వాసకు స్వచ్ఛమైన ఆయువు నందించేందుకు ఖమ్మంలో ఒక అద్భుతమైన మానవతా పర్వం ఆవిష్కృతమైంది. జన్మతః తలసేమియా వ్యాధితో పోరాడుతున్న చిన్నారులకు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ శ్రీకారం చుట్టిన ఉచిత ప్రత్యేక వైద్య శిబిరం అనేక కుటుంబాల్లో వెలుగులు నింపింది. హైదరాబాద్ నుంచి విచ్చేసిన ప్రముఖ హెమటాలజిస్ట్ డాక్టర్ దండమూడి రమణ తన హృదయపూర్వక వైద్య బృందంతో కలిసి ప్రతీ చిన్నారిని కంటికి రెప్పలా పరీక్షించారు. చిన్నారుల రక్త పరీక్షలు, స్కానింగ్ రిపోర్టులను క్షుణ్ణంగా పరిశీలించి, వారికి అవసరమైన అత్యంత విలువైన మందులను సూచించి కొండంత ధైర్యాన్ని అందించారు. ఈ సందర్భంగాడాక్టర్ దండమూడి రమణ మాట్లాడుతూ.. తలసేమియా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమన్నారు. వైద్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సూచించే మందులను క్రమం తప్పకుండా వాడించాలని సూచించారు. ప్రతి మూడు నుంచి ఆరు నెలలకోసారి తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని 8 శాతం కంటే తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హిమోగ్లోబిన్ స్థాయి తగ్గినప్పుడు చిన్నారులు త్వరగా అలసటకు గురవడంతో పాటు, దాని ప్రభావం శరీరంలోని ఇతర అవయవాలపై పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అవసరమైన సమయంలో రక్తం ఎక్కించడంతో పాటు, వైద్యుల సూచనల మేరకు మందులను సమయానికి అందించాలని తెలిపారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు వైద్య సహాయం అందించడం కేవలం చికిత్స మాత్రమే కాదని.. వారి కుటుంబాలకు "మీ వెంట మేమున్నాం" అనే భరోసా కల్పించడమేనని సంకల్ప సంస్థ ప్రతినిధులు పి. రవిచందర్, పి. అనిత, పి. పావని తెలిపారు. రక్తం కోసం, వైద్యం కోసం నిరంతరం ఎదురుచూసే చిన్నారులకు ఇలాంటి ఉచిత వైద్య సేవలు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్యం, వారి భవిష్యత్తు కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ మానవీయ దృక్పథంతో ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కిన్నెర మెమోరియల్ ట్రస్ట్ బాధ్యులు కంటమనేని రాజగోపాల్, డాక్టర్ ఎం. సోహితరెడ్డి, డాక్టర్ రుచిత, డాక్టర్ శరత్, రేడియాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ నారాయణమూర్తి, సంకల్ప సంస్థ బాధ్యులు పి. రవిచందర్, పి. అనిత, పి. పావని తదితరులు, వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

# పేకాట మత్తులో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు: ఎస్సై సంధ్య



**- గార్ల ఒడ్డు శివారులో పేకాట స్థావరంపై ఏన్కూర్ పోలీసుల దాడి.. ఎనిమిది మందిపై కేసు నమోదు**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజాన్ని తప్పుదోవ పట్టించే పేకాట, జూదం వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏన్కూరు ఎస్సై సంధ్య హెచ్చరించారు. పేకాట వ్యసనం కుటుంబాలను ఆర్థికంగా, మానసికంగా దెబ్బతీయడంతో పాటు యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రమాదం ఉందని ఆమె సూచించారు.ఖమ్మం జిల్లా, ఏన్కూరు మండల పరిధిలోని గార్ల ఒడ్డు శివారులో పేకాట స్థావరంపై ఆదివారం ఎస్సై సంధ్య తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,290 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన ఎనిమిది మందిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆమె వెల్లడించారు. అక్రమ వ్యాపారాలు, పేకాట, జూదం నిర్వహిస్తూ అమాయకులను ఆకర్షించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేకాట, జూదం సరదాగా ప్రారంభమైనా క్రమంగా వ్యసనంగా మారి కుటుంబాల్లో కలహాలు, అప్పులు, ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తాయని అందుకు యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సంధ్య పేర్కొన్నారు. కష్టపడి సంపాదించిన డబ్బును ఇలాంటి వ్యసనాల్లో కోల్పోయి కుటుంబ సభ్యులను బాధల్లోకి నెట్టవద్దని యువతకు హితవు పలికారు. సమాజానికి ఉపయోగపడే మార్గాల్లో తమ ప్రతిభను వినియోగించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎస్సై సంధ్య సూచించారు.గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, జూదం లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆమె కోరారు. ప్రజల సహకారంతోనే అక్రమ కార్యకలాపాలను అరికట్టి ప్రశాంతమైన, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని ఎస్సై సంధ్య తెలిపారు.

# ఎంఐఎం కార్యాలయంలో సర్వమత సమ్మేళనం..

**మహమ్మద్ ప్రవక్త గౌరవం ముస్లింలకు ప్రాణం కంటే విలువైనది..**

**ఈనెల 25, 26, 27వ తేదీలలో సర్కస్ గ్రౌండ్లో సిరత్ ఎక్స్ పోకు కు తరలిరండి**

**జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు సోహైబ్ అహ్మద్ ఖాన్**




**కరీంనగర్, సెప్టెంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** మహమ్మద్ ప్రవక్త జీవితం యావత్తు మానవజాతికి అనుసరణీయమని, ప్రవక్త గౌరవం యావత్తు ముస్లింలందరికీ ప్రాణం కంటే విలువైనదని, మహమ్మద్ ప్రవక్త సూచించిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు సోహైబ్ అహ్మద్ ఖాన్ అన్నారు. ఆదివారం రబిఉల్ అవ్వల్ మాసం సందర్భంగా మహమ్మద్ ప్రవక్త జన్మదిన మాసోత్సవాల సందర్భంగా ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయం దారుస్సలాంలో అన్ని మతాల ధార్మిక పండితులతో, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అధ్యక్షతన జల్సా సిరతున్నబి ఆధ్యాత్మిక సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు సోహైబ్ అహ్మద్ ఖాన్, మంకమ్మ తోట ఏరియా అధ్యక్షుడు మహమ్మద్ ఖైరుద్దీన్, పాస్టర్ క్రిస్టోఫర్, మంగళంపల్లి శ్రీనివాసాశర్మ, గురుద్వారా ప్రభంధక్ కమిటీ నేత లఖాన్ సింగ్ లు మాట్లాడారు. ఈ సందర్భంగా వక్తలు ఆధ్యాత్మిక సదస్సును ఉద్దేశించి మాట్లాడుతూ వారసత్వంగా మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని భవిష్యత్తు తరాలకు చెప్పాల్సిన బాధ్యత ప్రతి ముస్లింపై ఉన్నదని చెప్పారు. నేటి కంప్యూటర్, స్మార్ట్ ఫోన్ యుగంలో యువత, విద్యార్థులు పెడదారిన పట్టకుండా, చెడు వ్యసనాల బారిన పడకుండా మహమ్మద్ ప్రవక్త జీవిత సూత్రాలు చెప్పారని, వాటిని కుల, మతాలకు అతీతంగా తెలియజేయాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందన్నారు. ఈ జన్మ దిన మాసరోత్సవాల సందర్భంగా కరీంనగర్ జిల్లాలో ఒక లక్ష మందిని కుల మతాలకతీతంగా కలిసి మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను ఆయన జీవితంలో చేసినటువంటి మంచి కార్యక్రమాలను యావత్తు సమాజానికి తెలియపరచి వారిని చైతన్యవంతులుగా చేయడమే జమాతే ఇస్లామీ హింద్ ముఖ్య ఉద్దేశమని ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలా కేంద్రాలలో, మేజర్ గ్రామపంచాయతీలలో, మున్సిపల్ ఏరియాలలో కలియతిరిగి మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను యావత్తు మానవులందరికీ వివరిస్తామని చెప్పారు. ఎవరు అంగీకరించినా, అంగీకరించక పోయినా మహమ్మద్ ప్రవక్త కేవలం ముస్లింలకే ప్రవక్త కాదని, యావత్తు మానవులందరి కోసం ఏకేశ్వరుడైన అల్లాహ్ పంపించిన ప్రవక్త అని వివరించారు. సెప్టెంబర్ 25, 26, 27వ తేదీలలో నగరంలోని మహాత్మా జ్యోతిబాపూలే మైదానము సర్కస్ గ్రౌండ్లో మహమ్మద్ ప్రవక్త జన్మదిన మాస ఉత్సవాలకు సంబంధించి సిరత్ ఎక్స్ పో-2026ను నిర్వహిస్తున్నట్లు ఇందులో వివిధ స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రవక్త జీవిత చరిత్ర కు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. చివరి రోజు 27న సుమారు వేలాది మందితో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆధ్యాత్మిక బహిరంగ సభకు జమాతే ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షునితోపాటు, రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరూ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈఆధ్యాత్మిక సదస్సులో పిఆర్వో మహమ్మద్ రఫీ ఖిరాత్ కలాం చదువగా, దాదాపు 200మంది పైచిలుకు ఎంఐఎం కార్పొరేటర్లు, నాయకులు, మాజీ కార్పొరేటర్లు హాజరై విజయవంతం చేశారు. సదస్సుకు హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి గులాం అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌలానా ఘుఫ్రాన్ అసాధి, జమాతే ఇస్లామీ హింద్ నాయకులు సాజిద్ ఖాన్, ఇస్ హాఖ్, ఎంఐఎం జాయింట్ సెక్రటరీ హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, కార్పొరేటర్లు సయ్యద్ ఇబ్రహీం, మాజిద్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్లు అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, ఆరిఫ్ అహ్మద్, నాయకులు ఫసియుద్దీన్ ఖాలీద్, ఎంఎ సలీం, సురేశ్, సాజిద్, వాజిద్ అలీఖాన్, గాలి రాజు, అక్బర్ అలీ, అబ్దుల్లా ఖాన్, తాజుద్దీన్, సలీం, ఆవేజ్, మిర్జా పాషా, మేరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పేట్రేగిపోతున్న ఎక్సైజ్ కమిషనర్ అవినీతి అక్రమాలు

**● ప్రభుత్వ నిబంధనలకు పాతర... కాసులు ఇచ్చిన వారికి పోస్టింగ్స్ ● గంజాయి కేసులోనూ కమీషనర్ నాటకాలు! ● కోటి రూపాయలిస్తే కోర్టును మోసం చేసిన వారిని కాపాడటమేనా? ● ఒక్క గంజాయి కేసు.. పంచనామా ఫోర్జరీలు.. కోట్ల రూపాయల బదలాయింపు ● ఈగల్ టీంలు పెట్టినా.. ఈ అవినీతి రాబందుల నుంచి రక్షణ ఏదీ? ● ఎక్సైజ్ కమిషనర్ తీరుపై రాచాల యుగంధర్ గౌడ్ ధ్వజం**

హైదరాబాద్ సెప్టెంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):ఇటీవల ఎక్సైజ్ శాఖలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన సీఐ, ఎస్ఐ బదిలీలపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాచాల మాట్లాడుతూ రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ తీవ్ర అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని, అతని అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఆయనను రాష్ట్రం నుంచి సాగనంపాలని డిమాండ్ చేశారు.ఇటీవల జరిగిన సీఐ, ఎస్ఐ బదిలీలలో ప్రభుత్వ నిబంధనలకు పాతరేస్తు డబ్బులు ఇచ్చిన వారికే మంచి పోస్టింగ్స్ ఇచ్చారని విమర్శించారు. ఆయా పోస్టులను బట్టి ఒక్కో పోస్టుకు రూ. 30 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు ముడుపులు తీసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.ఈ అవినీతి బాగోతంలో కమిషనర్ తో పాటు మంత్రి సహాయకులు, గతంలో పనిచేసిన కొందరు ఉన్నతాధికారులు కలిసి ఒక ముఠాగా ఏర్పడి రూ.కోట్లు దండుకున్నారని మండిపడ్డారు.దీంతోపాటు ఖమ్మం జిల్లా భద్రాచలంలో ఏసి ఎన్ఫోర్స్ మెంట్ ఒక గంజాయి కేసును పట్టుకొని పంచనామ రిపోర్టుతో సహా ఇద్దరు నిందితులను సీఐకి అప్పగిస్తే, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఇచ్చిన పంచనామాను సిఐ చింపేసి, ఇద్దరు నిందితుల్లో ఒక్కరినే చూపించి అధికారుల సంతకాలను తానే ఫోర్జరీ చేసి కోర్టుకు నివేదించారని పేర్కొన్నారు. ఈ ఘటనపై డిప్యూటీ కమిషనర్ విచారణ జరిపి కమిషనర్ కి రిపోర్టు చేస్తే కంటితుడుపు చర్యగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ను అటాచ్ చేయడంతో పాటు సీఐని, కానిస్టేబుల్ ను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారని తెలిపారు.ఈ వ్యవహారంలో కూడా సీఐని డిస్మిస్ చేయకుండా కమిషనర్ దాదాపు రూ. కోటి లంచం తీసుకున్నట్లు జోరుగా ప్రచారం సాగుతుందన్నారు. ఫోర్జరీ సంతకాలు చేసిన సీఐపై ఎందుకు ఫోర్జరీ కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు.ఈమె గతంలో కూడా పట్టుకున్న



గంజాయిని తక్కువగా చూపించి మిగిలిన గంజాయిని అమ్ముకుని రూ.కోట్లు దండుకున్నారని అనేక ఆరోపణలు ఉన్నాయి.ఒకవైపు ప్రభుత్వం ఈగల్ టీమ్ లను ఏర్పాటు చేసి డ్రగ్స్ నివారణ చర్యల కోసం కృషి చేస్తుంటే ఇలాంటి అవినీతి రాబందుల నుంచి రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.న్యాయస్థానాలను సైతం తప్పుదోవ పట్టించిన అవినీతి అధికారులను కమిషనర్ ఎందుకు కాపాడుతున్నారని నిలదీశారు.ఎక్సైజ్ అధికారుల అవినీతి బాగోతానికి సంబంధించిన పూర్తి ఆధారాలు తమవద్ద ఉన్నాయని, త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, డిజి విజిలెన్స్ ను కలిసి పూర్తి ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తామని, అంతేకాకుండా రాష్ట్ర హైకోర్టును కూడా ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చి తెలంగాణను భ్రష్టు పట్టిస్తున్న కమిషనర్ హరికిరణ్ ను తిరిగి ఆంధ్ర ప్రాంతానికి సాగనంపే వరకు బీసీ పొలిటికల్ జెఎసి పోరాటం సాగిస్తోందని స్పష్టం చేశారు.మరి ఎక్సైజ్ శాఖలో ఇంత జరుగుతున్న కూడా సంబంధిత శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎందుకు మౌనం వహిస్తున్నారని, ఇదంతా మంత్రికి తెలిసి జరుగుతుందా? తెలియకుండా జరుగుతుందా? బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జెఎసి నాయకులు వివి గౌడ్, మహేందర్ నాయుడు, గోటూరి రవీందర్ గౌడ్, బత్తుల జితేందర్, రేనట్ల మల్లేష్, ముత్యాల వినోద్ సాగర్, కృష్ణప్రసాద్, శ్రీధర్, సిద్దార్థ్ తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్‌కు ఆధ్యాత్మికత తోడైతేనే సంతోషకరమైన భవిష్యత్తు

**ఇంజనీర్స్ డే సందర్భంగా 200 మంది ఇంజనీర్లు, శాస్త్రవేత్తలకు ఘన సత్కారం**

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్): సాంకేతిక ప్రగతితో పాటు మానవ విలువలు, ఆధ్యాత్మిక వికాసం కూడా సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ఇంజనీర్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లోని ఆదర్శనగర్‌లో ఉన్న బి.ఎం. బిర్లా సైన్స్ సెంటర్ కాంప్లెక్స్‌లోని అడ్మిరల్ గోపాల్ రావు బిర్లా కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సుమారు 200 మంది ఇంజనీర్లు, శాస్త్రవేత్తలను ఘనంగా సత్కరించారు."జాతి నిర్మాణకర్తలకు గౌరవం" అనే థీమ్‌తో బ్రహ్మాకుమారీస్ సైంటిస్ట్స్, ఇంజనీర్స్ & ఆర్కిటెక్ట్స్ విభాగం, బ్రహ్మాకుమారీస్ పీస్ హౌస్ హైదరాబాద్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.ఆల్ ఇండియా రేడియో, చీ+=×, చీూజ, ఎజు, ఉస్మానియా యూనివర్సిటీ, అవంతి ఇంజనీరింగ్ కాలేజ్, ఐ=ఐూ, ౯జజూ కొత్తగూడెం, సెయింట్ మేరీస్ గ్రూప్, +ఎవీజ, ౯జ, జుజ×ూ తదితర ప్రముఖ సంస్థలకు చెందిన ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.భౌతిక అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక వికాసం అవసరంకార్యక్రమంలో సైంటిస్ట్స్ అండ్ ఇంజనీర్స్ వింగ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ దీఖ అంజలి ముఖ్య ప్రసంగం చేశారు. సాంకేతిక, భౌతిక అభివృద్ధితో పాటు ప్రతి వ్యక్తి ఆధ్యాత్మికంగా కూడా ఎదగాల్సిన అవసరం ఉందని అన్నారు."సంతోషకరమైన జీవితానికి భౌతికవాదం, ఆధ్యాత్మికత మధ్య సమతుల్యత అవసరం. మనం బయట ప్రపంచాన్ని మాత్రమే కాకుండా మనలోకి కూడా చూసుకోవాలి" అని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుత కాలం సానుకూల మార్పుకు పిలుపునిస్తోందని, సమాజంలో సానుకూల పరివర్తన కోసం బ్రహ్మాకుమారీస్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.ఇంజనీరింగ్ నిపుణులకు రాజయోగ ధ్యానం పరిచయం చేయాలికార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్, తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ డా. రమణ నాయిక్ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. బ్రహ్మాకుమారీస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందిస్తూ, ఇంజనీరింగ్ నిపుణుల కోసం ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్‌లో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆహ్వానించారు.ముఖ్యంగా రాజయోగ ధ్యానం, ఆధ్యాత్మిక విలువల ద్వారా కలిగే ప్రయోజనాలను ఇంజనీర్లకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు."ఏమి చేయగలం కాదు.. ఏమి చేయాలి అనేదే ముఖ్యం"తెలంగాణ స్టేట్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జుూ+ కమిటీ చైర్మన్ జి. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో సానుకూల







పరివర్తనకు సమయం ఆసన్నమైందన్నారు."ఏమి చేయగలం అనేది కాదు.. ఏమి చేయాలి అనేదే ఇప్పుడు ఆలోచించాల్సిన విషయం" అని ఆయన అన్నారు. ఆధ్యాత్మికత మనలో జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు జీవితానికి సరైన దిశను చూపుతుందని పేర్కొన్నారు.సైన్స్‌స్పిరిచువాలిటీపై ప్రత్యేక సెషన్"సైన్స్ అండ్ స్పిరిచువాలిటీ సంతోషకరమైన ప్రపంచ భవిష్యత్తుకు భాగస్వాములు" అనే అంశంపై ప్రత్యేక సెషన్ నిర్వహించారు. శాస్త్రీయ పురోగతితో పాటు మానవ విలువలు, అంతర్గత శాంతి, ఆధ్యాత్మికతను సమన్వయం చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు.దీఖ మీనాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన రాజయోగ ధ్యాన అనుభవ కార్యక్రమంలో పాల్గొన్న ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు కొంతసేపు నిశ్శబ్దం, ప్రశాంతత, అంతర్గత స్థిరత్వాన్ని అనుభవించారు.నవజీవన్ అనాథాశ్రమానికి చెందిన చిన్నారుల స్వాగత నృత్యంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం అర్బన్ ఆర్ట్స్ డైరెక్టర్ దేవయాని ప్రమోద్ షిండే స్వాగత ప్రసంగం చేశారు. విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ శాంతి సరోవర్ హైదరాబాద్‌కు చెందిన ఇంజనీర్ దీఖ సాయి కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.ఇంజనీర్లు, శాస్త్రవేత్తల సేవలను గౌరవిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం సాంకేతిక ప్రగతితో పాటు అంతర్గత శాంతి, మానవ విలువలు, ఆధ్యాత్మిక బలమే సమాజానికి స్థిరమైన మరియు సంతోషకరమైన భవిష్యత్తుకు పునాది అనే సందేశాన్ని చాటిచెప్పింది.

## ఆర్యవైశ్య మహాసభ భవన భూమిపూజకు తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

**● ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి సీతా చంద్రరావు**



ఖమ్మం, సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ పిలుపు మేరకు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విచ్చేసి ఆశీర్వదించిన ప్రతిష్ఠాత్మకమైన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ భవన సముదాయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి సీతా చంద్రరావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఖమ్మం పట్టణంతో పాటు జిల్లాలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మండల పిఎస్టీలు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, సంఘం నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని జయప్రదం చేయడంలో అందించిన సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.తాను వ్యక్తిగతంగా కార్యక్రమానికి అందుబాటులో లేకపోయినప్పటికీ, ఫోన్ కాల్స్, సోషల్ మీడియా, పత్రికల ద్వారా చేసిన విజ్ఞప్తిని మన్నించి కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య సమాజ ఐక్యతను చాటుతూ పెద్ద సంఖ్యలో హాజరై ఖమ్మం జిల్లా కీర్తి ప్రతిష్టలను మరింత పెంపొందించారని అన్నారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా హృదయపూర్వక నమస్కారాలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పసుమర్తి సీతా చంద్రరావు పేర్కొన్నారు.

## వైరల్ ఫీవర్‌తో చికిత్స పొందిన చైర్మన్ మోహన్‌కు కాంగ్రెస్ నేతల పరామర్శ

**● త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన పార్టీ నాయకులు**



కల్లూరు, సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :ఇటీవల వైరల్ ఫీవర్‌తో ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందిన కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను పరామర్శించారు.కల్లూరు మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏనుగు సత్యంబాబు, పెద్దబోయిన శ్రీనివాసరావు, తోట సుబ్బారావు, రాథోడ్ శ్రీనివాసరావు, బొల్లం ఉపేందర్ తదితరులు చైర్మన్ మోహన్ స్వగృహానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వైరల్ ఫీవర్ కారణంగా ఖమ్మంలో చికిత్స పొందిన మోహన్ ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో నాయకులు ఆయనను కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. చైర్మన్ మోహన్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకొని ప్రజా సేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు. మోహన్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం ఎలా ఉందనే విషయాలను అడిగి తెలుసుకుని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల వేళ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం


**- సికింద్రాబాద్ జోన్ సెంట్రల్ పీస్ కమిటీ**

సికింద్రాబాద్,సెప్టెంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) : రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని సికింద్రాబాద్ జోన్ పరిధిలోని గణేష్ మండపాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణపై సెంట్రల్ పీస్ కమిటీ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించింది.నగరంలో ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, మతసామరస్యంతో నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు అధికారులు, పీస్ కమిటీ ప్రతినిధులు ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. మండపాల వద్ద భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ డీసీపీ ఎం.ఎస్. రక్షితా కృష్ణమూర్తి ఐపీఎస్, అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ శశాంక్ రెడ్డి, గాంధీనగర్ ఏసీపీ యాదగిరి, ఓయూ ఏసీపీ జగన్ తో పాటు జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.అలాగే సెంట్రల్ పీస్ కమిటీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శరత్ శ్యామ్, మాజీ ఏజీపీపీ అబ్దుల్ కబీర్, ఉపాధ్యక్షులు ఫరీదుద్దీన్ యూనుస్, మాడపు చంద్రశేఖర్, డాక్టర్ యూసుఫ్ హమీది, కన్వీనర్ సయ్యద్ ఖలీద్ షా చిస్తీ, సభ్యులు శ్రీలత, బసంతి కౌర్, మల్లం రమేష్, అరఫాత్, మొహమ్మద్ అలీ, జహంగీర్, తదితరులు హాజరయ్యారు.



# కాశీని కాపాడే 56 మంది వినాయకులు- ఈ ఆలయాల వెనుక ఉన్న రహస్యం ఏంటో తెలుసా?

ఏ శుభకార్యం ప్రారంభించినా, ఎలాంటి పూజ చేసినా మొదటగా వినాయకుడిని పూజించడం మన సంప్రదాయం. గణపతిని స్మరిస్తే తలపెట్టిన కార్యంలో ఎలాంటి విఘ్నాలు ఎదురుకావు అనే విశ్వాసం భక్తులలో ప్రబలంగా ఉంది. అంతేకాదు వినాయకుడు జ్ఞాన ప్రదాత. బుద్ధికి, జ్ఞానానికి, విజ్ఞానానికి ప్రతీక. మహాభారతాన్ని వ్యాసుడు చెప్తుంటే, అత్యంత వేగంగా తన దంతం విరిచి మరీ మహాకావ్యంగా రాసిన ధీశాలి గణపతి. అలాంటి గణపతికి దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో ఆలయాలు కలవు. ముఖ్యంగా దక్షిణ భారతంలో గణపతిని విశేషంగా ఆరాధిస్తారు. గణపతి ప్రార్థిస్తే ఇష్టకామ్యాలు సిద్ధిస్తాయని విశ్వాసం.





### గణపతి మూల మంత్రం

జీవితంలో ఎన్నో సమస్యలు ఎదురైనప్పుడు, మనసారా “ఓం గం గణపతయే నమః” అని స్వామివారిని స్మరించుకుంటే మనలో ఒక నమ్మకం, ఒక ధైర్యం కలుగుతుంది. ఈ నేపథ్యంలో కర్ణాటకలోని అతి ప్రాచీనమైన ఓ గణపతి క్షేత్రం గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.

### ఘంటే గణపతి దేవాలయం

కర్ణాటక రాష్ట్రంలో వెలసిన ప్రముఖ వినాయక దేవాలయాలలో ఘంటే గణపతి దేవాలయం కూడా ఒకటి. కర్ణాటకలోని గోకర్ణ నుంచి దండేలి వెళ్లే మార్గంలో, దట్టమైన అడవుల మధ్య వెలసి ఉన్న గంట గణపతి దేవాలయం భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లుతోంది.

### అభీష్టసిద్ధి కలిగించే ఘంటే గణపతి

ప్రకృతి అందాల నడుమ కొలువైన ఈ గణపతిని దర్శించుకోవడానికి ప్రతిరోజు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేస్తుంటారు. ఈ ఆలయానికి వచ్చే భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారిని పూజిస్తారు. మంచి మనసుతో, నమ్మకంతో గణపతిని ప్రార్థిస్తే కోరుకున్న కోరికలు తప్పకుండా నెరవేరుతాయని భక్తుల విశ్వాసం.

### మనసులోని బాధలు వినే గణపతి

మన మనసులోని బాధను చెప్పుకోవడానికి సాటి మనిషి లేకపోయినా, గణపతికి చెప్పుకుంటే చాలు. అందుకే ఘంటే గణపతి ఆలయాన్ని సందర్శించి మన కష్టాన్ని చెప్పుకుంటే చాలు ఆ గణపతి కరుణతో అనుగ్రహిస్తాడని నమ్మకం. అంతేకాదు మన కన్నీటిని అర్థం చేసుకునే తండ్రిలా, మన కష్టాలను తొలగించే తల్లిలా, విఘ్నేశ్వరుడు మన వెంట ఉంటాడని భక్తుల విశ్వాసం.

### ఘంటే గణపతి ఆలయం ఎక్కడుంది?

కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా, ఎల్లపూర్ సమీపంలోని చందగులి గ్రామంలో శ్రీ ఘంటే గణపతి ఆలయం కొలువై ఉంది.

### పేరు వెనుక రహస్యం

కన్నడ భాషలో 'ఘంటే' అనగా గంట అని అర్థం. భక్తులు తమ మనసులో కోరుకున్న కోరికలు నెరవేరిన తర్వాత, స్వామి వారికి ఇక్కడ గంటలను కానుకగా సమర్పిస్తారు. జాగృత క్షేత్రం ఈ ఆలయంలో లక్షలాది గంటలు వేలాడదీసి ఉంటాయి. భక్తులు గంట మోగిస్తూ గణపతిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఇది చాలా శక్తివంతమైన జాగృత క్షేత్రంగా భక్తులు భావిస్తారు.

### ఆలయ విశేషాలు

గర్భాలయంలో గణపతి మూర్తి రమ్యంగా దర్శనమిస్తుంది. ఆలయం గోడలపైన, పైకప్పు మీద చెక్కతో తయారైన కళాకృతులు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటాయి. దట్టమైన అడవులు, పచ్చని ప్రకృతి మధ్య ప్రశాంతమైన వాతావరణంలో వెలసి ఉన్న ఈ క్షేత్రాన్ని దర్శించడం మరపురాని ఆధ్యాత్మిక అనుభూతి. ప్రశాంతతకు మారుపేరైన ఈ క్షేత్రంలో భక్తులు కొంతసేపు ధ్యానం చేసుకుంటారు.

### పూజోత్సవాలు

గంట గణపతి ఆలయంలో ప్రతిరోజు జరిగే నిత్య పూజలతో పాటు ప్రతి బుధవారం, ఆదివారం స్వామివారికి అభిషేకం జరుగుతుంది. అలాగే ప్రతి మాసంలో బహుళ పక్షంలో వచ్చే సంకటహర చతుర్థి రోజు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు విశేషంగా జరుగుతాయి. ఇక గణేష్ నవరాత్రులు ఇక్కడ వైభవంగా జరుగుతాయి.

### గంటల సమర్పణ

ఈ ఆలయంలో గణపతిని దర్శించి మొక్కుకుంటే కోరిన కోరికలు తీరుతాయని విశ్వాసం. అనుకున్న పనులు పూర్తయ్యాక భక్తులు గణపతికి గంట సమర్పించి తమ మొక్కును తీర్చుకుంటారు. ఇలా భక్తులు సమర్పించిన అనేక గంటలు ఆలయ ప్రాంగణంలో దర్శనమిస్తాయి. మనం కూడా మన జీవితంలో విఘ్నాలు తొలగించి, కోరిన కార్యాలు నెరవేర్చి, సుఖశాంతులు చేకూరాలని ఘంటే గణపతిని ప్రార్థిద్దాం.

### ఓం గం గణపతయే నమః

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# వాహనదారులకు మారుతి సుజుకి బిగ్ షాక్: మళ్లీ పెరగనున్న కార్ల ధరలు- వివరాలు ఇవే!




దేశీయ కార్ల తయారీ రంగంలో తిరుగులేని ఆధిపత్యంతో కొనసాగుతున్న మారుతి సుజుకి ఇండియా (మీుతీబ్ఱ ాబఓబనెఱ ×అఏఖు) వాహనదారులకు మరోసారి గట్టి షాక్ ఇచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా తన కొన్ని మోడళ్ల ధరలను పెంచుతున్నట్లు సంస్థ సోమవారం అధికారి కంగా ప్రకటించింది. ఈ తాజా నిర్ణయం ప్రకా రం ఎంపిక చేసిన కార్ల మోడళ్లపై గరిష్ఠంగా రూ. 20,000 వరకు పెంపు ఉంటుంది. ఈ సవరించిన ధరలు ఈ నెల (సెప్టెంబర్ 2026) నుంచే అమలులోకి రానున్నట్లు మారుతి సుజుకి స్పష్టం చేసింది. గడిచిన మే నెల నుంచి కంపెనీ ధరలను పెంచడం ఇది మూడోసారి కావడం గమనార్హం. దీనికి ముందు ప్రకటించిన రెండు ధరల పెంపుదలలు కంపెనీ పోర్ట్‌ఫోలియోలోని దాదాపు అన్ని మోడళ్లకు వర్తించగా, ఈసారి మాత్రం కేవలం ఎంపిక చేసిన మోడళ్లపైనే భారాన్ని మోపారు. ఈ మేరకు మారుతి సుజుకి ఇండియా ఒక రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పూర్తి వివరాలను వెల్లడించింది. “కార్ల తయారీకి అవసరమయ్యే ముడిసరుకుల వ్యయాలు (ఇన్‌పుట్ కాస్ట్స్) నిభారాన్ని మోపారు. ఈ మేరకు మారుతి సుజుకి రంతరాయంగా, విపరీతంగా పెరుగుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కంపెనీపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ఎంపిక చేసిన మోడళ్ల ధరలను రూ. 20,000 వరకు పెంచాలని నిర్ణయించాము. ఈ నూతన ధరలు సెప్టెంబర్ 2026 నుంచి తక్షణమే అమల్లోకి వస్తాయి” అని మారుతి సుజుకి తన నివేదికలో పేర్కొంది.


గత కొన్ని నెలలుగా పెరుగుతున్న వ్యయాల ప్రభావాన్ని వినియోగదారులపై పడకుండా చూసేందుకు కంపెనీ అంతర్గతంగా అనేక రకాల వ్యయ నియంత్రణ చర్యలను చేపట్టినట్లు తెలిపింది. అయినప్పటికీ, మార్కెట్లో ద్రవ్యోల్బణ భారం రికార్డు స్థాయికి చేరడం, ప్రతికూల వ్యయ వాతావరణం సుదీర్ఘకాలం పాటు కొనసాగుతుండటంతో కంపెనీకి వేరే ప్రత్యామ్నాయం లేకుండా పోయిందని వివరించింది. ముడిసరుకుల ధరల భారాన్ని పూర్తిగా భరించడం సంస్థకు సాధ్యం కాకపోవడం వల్లే, అందులో కొంత భాగాన్ని మార్కెట్‌కు అంటే వినియోగదారులకు బదిలీ చేయక తప్పని పరిస్థితి ఏర్పడిందని కంపెనీ యాజమాన్యం వివరించింది. అయితే, ఈ భారం కస్టమర్లపై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చూసేందుకు తాము నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నామని మారుతి సుజుకి అదనంగా జోడించింది. ఆటోమొబైల్ రంగంలో స్టీల్, అల్యూమినియం, ప్లాస్టిక్ వంటి కీలక ముడిపదార్థాల ధరలు పెరగడం వల్ల కార్ల తయారీ వ్యయం గణనీయంగా పెరిగింది. పండుగల సీజన్ తీసుకున్న ఈ నిర్ణయం మధ్యతరగతి కొనుగోలుదారులపై అదనపు ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. అయినప్పటికీ కంపెనీ తన మార్కెట్ వాటాను కాపాడుకుంటూనే, నాణ్యమైన ు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసింది.

# ‘ముడతలు, నల్లటి వలయాల’తో ఇబ్బంది పడుతున్నారా? - ఈ నేచురల్ టిప్స్ ట్రై చేయండి!



: ఈ రోజుల్లో ఒత్తిడి, కాలుష్యం కారణంగా చర్మ సౌందర్యాన్ని కాపాడుకోవడం ఒక పెద్ద సవాలుగా మారింది. అయితే, ఖరీదైన బ్యూటీ ప్రొడక్ట్స్ వాడడమే కాకుండా, మన దైనందిన జీవితంలో కొన్ని చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా చర్మాన్ని సహజంగా మెరిపించుకోవచ్చు. రోజ్? వాటర్, తేనె, బాదం నూనె చర్మ సంరక్షణకు తోడ్పడతాయి. రోజ్? వాటర్ చర్మానికి తాజాదనాన్ని, ఉపశమనాన్ని ఇస్తుంది. అలాగే, తేనె, బాదం నూనె చర్మంలోని తేమను నిలిపి ఉంచడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. చర్మ సంరక్షణలో ఎలా సహాయపడతాయి : తేనె సహజమైన హ్యూమెక్టెంట్‌గా పనిచేస్తుంది. ఇది చర్మంలో తేమను నిలిపి ఉంచడానికి, చర్మం మరింత మృదువుగా కనిపించడానికి సహా యపడుతు ంది. బాదం నూనె ఎమోలియంట్‌గా పనిచేస్తుంది. పొడిబారడాన్ని తగ్గిస్తుంది. అలాగే రోజ్ వాటర్ చర్మానికి చల్లదనాన్ని ఇస్తుంది. ఈ ప్రయోజనాలు చర్మం మొత్తం రూపాన్ని తాత్కాలికంగా మెరుగుపం ˇచవచ్చు. ఎలా ఉపయోగించాలి : రోజ్?వాటర్, బాదం, తేనె పదార్థాలను కొద్ది పరిమాణంలో తీసుకుని బాగా మిక్స్ చేసి, శుభ్రమైన చర్మంపై పల్చటి పొరలా అప్లై చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసేటప్పుడు కళ్లలోకి వెళ్లకుండా జాగ్రత్త పడాలి. కాసేపు అలాగే ఉంచిన తర్వాత, చల్లటి నీటితో మెల్లగా కడిగేసుకోవాలి. ముఖ్యంగా, దీనిని అప్లై చేసేటప్పుడు లేదా తొలగించేట ప్పుడు కళ్ల కింద ఉండే సున్నితమైన చర్మాన్ని ఎప్పుడూ గట్టిగా రుద్దకూడదు. బరువు తగ్గినప్పుడు శరీరంలోని కొవ్వు ఏమవ ుతుంది? - తెలిస్తే ఆశ్చర్యపోతారు! ఎల్లప్పుడూ ప్యాచ్ టెస్ట్ చేసుకోండి : ఈ మిశ్రమాన్ని ముఖంపై ఉపయోగించే ముందు, చేతి లోపలి భాగంలో లేదా చెవి వెనుక భాగంలో ప్యాచ్? టెస్ట్ చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. దురద, మంట, ఎరుపు లేదా వాపు వంటి సమస్యలు ఏవైనా వస్తున్నాయేమో కాసేపు గమనించాలం టున్నారు. ఒకవేళ చర్మంపై ఎలాంటి మంట లేదా అసౌకర్యం కలిగినా, ముఖ్యంగా సెన్సిటివ్ చర్మం ఉన్నా లేదా అలర్జీలు వచ్చే అవకాశం ఉన్నా వీటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. నల్లటి వలయాలు, ముడతలను తొలగిస్తుందా? : కళ్ల కింద నల్లటి వలయాలు, ముడతలను బాదం, తేనె, రోజ్? వాటర్? మిశ్రమం శాశ్వతంగా నయం చేయగలదని చెప్పడానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. ఈ మిశ్రమం చర్మానికి కేవలం తాత్కాలికంగా తేమను మాత్రమే అందిస్తుందంటున్నారు నిపుణులు. నల్లటి వలయాల వెనుక జన్యుపరమైన లోపాలు, అలర్జీలు, వయసు పైబడటం, నిద్రలేమి వంటి అనేక అంతర్గత కారణాలు ఉంటాయి. కాబట్టి, కేవలం పైపూతలతోనే ఈ సమస్య పూర్తిగా పరిష్కారం కాదంటున్నారు నిపుణులు. ఆరోగ్యకరమైన చర్మం కోసం ప్రశాంతంగా నిద్రపోవడం, శరీరానికి తగినంత నీరు, సమతుల్య ఆహారం, ప్రతిరోజూ సన్ ?స్క్రీన్ రాసుకోవడం లాంటివి చేయా లంటున్నారు నిపుణులు. చర్మాన్ని ఎక్కువగా తాకడం లేదా గట్టిగా రుద్దడం లాంటివి చేయవద్దని చెబుతున్నారు.

# వినాయక చవితి 2026- గణపతి ప్రతిష్ఠాపనకు సుముహూర్తాలు ఇవే!



దేశవ్యాప్తంగా ప్రజలందరూ ఒక్కటిగా సమైక్యంగా జరుపుకునే పండుగ వినాయక చవితి! ఈ ఏడాది వినాయక చవితి తేదీలో గందరగోళం? తిథి ద్వయం వల్ల పండుగ ఏ రోజు జరుపుకోవాలని విషయంపై స్పష్టత ఇస్తున్న పండితులు!

తిథి విషయంలో గందరగోళం!

తెలుగు పంచాంగం ప్రకారం పర్వదినాల మాసం భాద్రపద మాసంలో శుద్ధ చవితి రోజున వినాయక చవితి జరుపుకోవడం సంప్రదాయం. అయితే ఈ సంవత్సరం భాద్రపద శుద్ధ చవితి రెండు రోజుల్లో ఏర్పడనుండడంతో వినాయక చవితి జరుపుకునే విషయంలో కొంత గందరగోళం నెలకొంది. ఇదే అంశంపై పండితులు ఏమంటున్నారు? అసలు వినాయక చవితి ఎప్పుడు జరుపుకోవాలి? అనే విషయం గురించి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

### వినాయక చవితి ఎప్పుడు?

తెలుగు పంచాంగం ప్రకారం ఈ ఏడాది సెప్టెంబర్ 14, సోమవారం ఉదయం 7:10 నిమిషాల వరకు భాద్రపద శుద్ధ తదియ తిథి నెలకొని ఉంది. 7:11 నిమిషాల నుంచి భాద్రపద శుద్ధ చవితి తిథి ప్రవేశిస్తోంది. అయితే పండుగ జరుపుకోవాలంటే సూర్యోదయంతో తిథి ఉండాలి అనే నియమాన్ని అనుసరిస్తే వినాయక చవితి పండుగను సెప్టెంబర్ 14, సోమవారం కాకుండా సెప్టెంబర్ 15, మంగళవారం జరుపుకోవాలి. ఈ విధంగా పండుగ తిథి 14, 15 తేదీల్లో, రెండు రోజుల్లోనూ వ్యాపించి ఉండటంతో భక్తుల్లో సందిగ్ధత ఏర్పడింది.

పండితులు ఏమంటున్నారు?

శాస్త్ర నియమాల ప్రకారం వినాయక చవితి నిర్ణయానికి సంబంధించి పండితులు ముఖ్యమైన విషయాలను కూలంకుషంగా పరిశీలించిన పిదప తమ నిర్ణయాన్ని ఈ విధంగా వివరించారు.

మధ్యాహ్న వ్యాప్తి ముఖ్యం

వినాయకుడు భాద్రపద చతుర్థి నాడు మధ్యాహ్న సమయంలో జన్మించాడని పురాణాలు చెబుతున్నాయి. కాబట్టి చవితి తిథి ఏ రోజు మధ్యాహ్నం వేళలో ఉంటుందో, ఆ రోజే పండుగను జరుపుకోవాలని పురాణాలు చెబుతున్నాయి.

### సెప్టెంబర్ 14 నే పండుగ

సెప్టెంబర్ 14, సోమవారం మధ్యాహ్నం అంతా చవితి తిథి పూర్తిగా అందుబాటులో ఉంది. కానీ సెప్టెంబర్ 15 మంగళవారం ఉదయం 7:44 గంటలకే తిథి ముగిసిపోతుంది. కాబట్టి సెప్టెంబర్ 14నే పండుగను, విగ్రహ ప్రతిష్ఠాపనను నిర్వహించాలని పండితులు నిర్ణయించారు.

### గణపతి ప్రతిష్ఠాపనకు సుముహూర్తాలు ఇవే!

వినాయక చవితి రోజున అంటే సెప్టెంబర్ 14 సోమవారం నాడు గణేష్ చతుర్థి పూజ ప్రారంభించేందుకు, విగ్రహ ప్రతిష్ఠాపనకు వివరించిన శుభ సమయాలు ఇలా ఉన్నాయి.

**అభిజిత్ ముహూర్తం :** సోమవారం మధ్యాహ్నం 12:09 గంటల నుంచి మధ్యాహ్నం 12:58 గంటల వరకు శుభప్రదం

వినాయకుడి ఆరాధనకు శుభ సమయం: ఉదయం 11:05 గంటల నుంచి మధ్యాహ్నం 1:35 గంటల వరకు వినాయకుని పూజించడానికి ఆరాధించడానికి అత్యంత శు భకరమైన సమయమని పండితులు చెబుతున్నారు.

ఈ సమయంలో వినాయకుడి భక్తులు బొజ్జ గణపయ్యను ఆరాధించడం వల్ల శుభ ఫలితాలొస్తాయని పండితులు వివరిస్తున్నారు.

### అరుదైన యోగాలు:

జ్యోతిష్యశాస్త్రం ప్రకారం, ఈసారి గణేష్ చతుర్థి రోజున అనేక శుభ యోగాలు ఏర్పడనున్నాయి. ఈ పవిత్రమైన రోజున బ్రహ్మ యోగం, ఇంద్ర యోగాలు ఏర్పడనున్నాయి. దీంతో పాటు చిత్రా నక్షత్రం మధ్యాహ్నం 1:55 గంటల వరకు ఉంటుంది. ఆ తర్వాత స్వాతి నక్షత్రం ప్రారంభమవుతుంది. ఈ రోజంతా బ్రహ్మ యోగం, ఇంద్ర యోగాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇంద్ర యోగం ప్రభావం మరుసటి రోజు అంటే అంటే సెప్టెంబర్ 15వ తేదీ మధ్యాహ్నం 12:19 గంటల వరకు ఉంటుంది. ఈ యోగాల వలన ఈసారి వినాయక చవితి అందరికీ శుభ ఫలితాలను ఇస్తుందని పండితులు చెబుతున్నారు.

### మినహాయింపు

ఏదైనా అనివార్య కారణాల వల్ల లేదా స్థానిక ఆచారాల రీత్యా సోమవారం పూజ చేసుకోలేని వారు, సెప్టెంబర్ 15, మంగళవారం ఉదయం 7:44 గంటలలోపు చవితి తిథి ముగిసేలోగా పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకోవచ్చని పండితులు సూచిస్తున్నారు. కాబట్టి, వినాయక చవితి పండుగ ఎప్పుడు జరుపుకోవాలనే విషయంలో ఎలాంటి సందేహాలు పెట్టుకోకుండా సెప్టెంబర్ 14, సోమవారం నాడే పండుగ జరుపుకోవాలి. ఈ విధంగా బొజ్జ గణపయ్య పూజకు భక్తులు తగిన ఏర్పాట్లు చేసుకోవచ్చు.

ఓం శ్రీ మహాగణాధిపతయే నమః

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# హౌస్‌మేట్స్ ఎంగిలి చేసిన గ్లాసులు కడిగిన నాగార్జున.. రోహిత్‌కు ఇచ్చిపడేశారుగా



బిగ్ బాస్ సీజన్ 10 ఆసక్తికరంగా సాగుతుంది. హౌస్ మేట్స్ మధ్య విభేదాలు తొలి రోజు నుంచే మొదలయ్యాయి. హౌస్ లో రెండు టీమ్స్ డివైడ్ చేశారు బిగ్ బాస్. అలాగే హౌస్ లో ఇప్పటికే ముగ్గురు హౌస్ మేట్స్ గా కన్ఫర్మ్ అయ్యారు. రోహిత్, వంశీ, రామ్ ప్రసాద్. ఇక శనివారం , ఆదివారం హోస్ట్ నాగార్జున వచ్చి హౌస్ మేట్స్ కు క్లాస్ తీసుకుంటారన్న విషయం తెలిసిందే. మొదటి శనివారం అంటే నేడు నాగ్ బిగ్ బాస్ స్టేజ్ మీదకు వచ్చారు. ఇందుకు సంబందించిన పప్రోమోను విడుదల చేశారు. అయితే ఈ ప్రోమోలో నాగ్ రోహిత్ కు గట్టిగానే ఇచ్చిపడేశారు. ముందుగా హౌస్ లో హౌస్ మేట్స్ అయినా ముగ్గురిని గార్డెన్ ఏరియాకు పిలిచారు. ముగ్గురికి కంగ్రాట్స్ చెప్పి ముగ్గురికి మిల్క్ షేక్స్ ఇచ్చారు. ఫాస్ట్ గా తాగేసేయమని చెప్పారు నాగ్. ముగ్గురు ఆ మిల్క్ షేక్స్ తాగిన తర్వాత ఆ గ్లాసులను స్టేజ్ పైకి తీసుకొచ్చారు.ఆ గ్లాసులను స్వయంగా నాగార్జున కడిగారు. స్టేజ్ పై నాగ్ హౌస్ మేట్స్ తాగిన ఎంగిలి గ్లాసులు కడటంతో అక్కడ ఉన్నవారు షాక్ అయ్యారు. నాగ్ చేసిన పనికి కంటెస్టెంట్స్ చప్పట్లు కొట్టారు. ఏ పని తక్కువ కాదు.. ఏ పని చిన్నది కాదు. ఎంగిలి గ్లాసులు , ప్లేట్స్ కడిగాను అని చెప్పడం కరెక్ట్ కాదు అని రోహిత్ కు క్లాస్ తీసుకున్నారు నాగార్జున. అలాంటి ఉద్దేశం ఉంటే హౌస్ లో ఉండొద్దు అని అన్నారు నాగార్జున. మీ ఎంగిలి ప్లేట్స్ నేను కడగాలి అనే ఆలోచనలు కరెక్ట్ కాదు అన్నారు నాగ్.అలాగే ఝాన్సీని లేపి నువ్వు ఏం విన్నావ్ అని అడగ్గా.. మీరు ఎంగిలి చేసినవి నేను ఎందుకు కడగాలి అని అన్నాడు అని చెప్పింది. ఆతర్వాత శాలినిని స్టోర్ రూమ్ కు పంపించి ఎంగిలి కాప్స్ తెప్పించారు నాగ్.. అయితే ఎంగిలి అంటే నేను ఏమన్నన్నంటే అంటూ రోహిత్ ఏదో చెప్పబోతుంటే.. వర్డ్స్ గురించి కాదు.. అయినా నీ డ్యూటీ ఏంటి రోహిత్ .? అని నాగ్ ప్రశ్నించారు. ఈ సీజన్ లో రియాక్షన్ తో పాటు వెంటనే శిక్ష కూడా ఉంటుందని అన్నారు నాగ్. ఆతర్వాత త్రిగుణ్ ను లేపి పిల్ల బచ్చా, డొల్ల రాజా, స్టెరాయిడ్ డొల్ల అని నాగ్ అనగానే. తప్పు నాదే క్షమాపణ అడుగుతా సార్ అని త్రిగుణ్ అన్నాడు . గార్డెన్ ఏరియాలో ఓ టైర్ పెట్టి దాన్ని పైకి ఎత్తి పట్టుకొని నేను చెప్పే వరకు తిరుగుతూ ఉండు అని చెప్పారు నాగ్ ఈ ప్రోమో చూస్తుంటే ఈ రోజు హౌస్ లో ఉన్న వారికి నాగ్ గట్టిగానే ఇచ్చిపడేశారని అర్థమవుతుంది.

# నాని ఈ రేంజ్‌లో యాక్షన్ చేస్తారనుకోలేదు.. ఇరగదీశాడు : రామ్ లక్ష్మణ్ మాస్టర్స్



న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. రామ్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. నాని గారి క్యారెక్టర్ చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ గారు చాలా కొత్తగా డిజైన్ చేశారు. రెండు జడలు వేసుకున్న హీరోను ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకు చూడలేదు. మాకు కూడా అది చాలా కొత్తగా అనిపించింది. నాని గారు ప్రేక్షకులకు కొత్తదనం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. నాని గారు ఈ స్థాయిలో యాక్షన్ చేయడం ఇదే మొదటిసారి. ఇందులో యాక్షన్ సీన్స్ చాలా హెవీగా ఉంటాయి. 'దసరా' కంటే మూడు రెట్లు ఎక్కువ యాక్షన్ ఉంటుంది.

జడలతో యాక్షన్ సీక్వెన్స్ చేయడం మామూలు విషయం కాదు. యాక్షన్ చేస్తున్నప్పుడు ఆ జడలు రూప్‌లకు, ముఖానికి తగులుతుంటాయి. అలాంటి యాక్షన్ సీక్వెన్స్ చేయడం మాకు కూడా కొత్త అనుభవమే. మా అసిస్టెంట్‌కు కూడా అలాంటి జడలు వేయించి అందులో ఉండే కష్టం తెలుసుకుని మరీ యాక్షన్‌ను కంపోజ్ చేశాం. నాని గారి కెరీర్‌లోనే ఇంత కష్టం ఎప్పుడూ పడలేదు. ప్రతి విషయంలో తన 100 శాతం కష్టపడ్డాడు. ఎన్ని టేక్స్ అయినా చేయాలని మనసులో ఫిక్స్ అయ్యాడు. నిజంగా నాని ఇంత కష్టపడతాడని మేం ఊహించుకోలేదు. అంత గొప్పగా ఈ సినిమా కోసం కష్టపడ్డాడు అన్నారు.నాని బేర్ బాడీతో చేసే యాక్షన్ సీక్వెన్స్‌లు ఉంటాయి. అవి స్క్రీన్‌పై చేయడం అంత ఈజీ కాదు. బాడీ బిల్డింగ్ చేయాలి. డైటింగ్‌లో ఉండాలి. ఇందులోనూ దర్శకుడు శ్రీకాంత్ తనకు అనుకున్నది వచ్చేంతవరకు రాజీపడరు. శ్రీకాంత్ తీసుకున్న విజన్‌కు నాని 100 శాతం న్యాయం చేశారు. అందులో మేం భాగమవడం అదృష్టంగా భావిస్తున్నాం. మా యాక్షన్ బ్లాక్స్ పూర్తి చేయడానికి దాదాపు పది రోజులు పట్టింది. ఇందులో కొత్త మనుషులు, కొత్త బాడీ లాంగ్వేజ్.. అంతా కొత్తగానే ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ ఎంచుకున్న కథ సహజంగానే యాక్షన్‌ను డిమాండ్ చేస్తుంది.




# ఆదర్శ కుటుంబం టీజర్ వచ్చేసింది.

వెంకీ మరోసారి అదరగొట్టనున్నారుగావిక్టరీ వెంకటేష్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఆదర్శ కుటుంబం. ఇటీవలే వరుస సినిమాలతో వెంకీ దూసుకుపోతున్నారు. బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంటూ దూసుకుపోతున్నారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఆయన.. ఆతర్వాత మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ గారు సినిమాలో గెస్ట్ రోల్ చేసి మెప్పించారు. ఈ సినిమా కూడా బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఇక ఇప్పుడు ఆదర్శ కుటుంబం హౌఖ 47 చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమా నుంచి క్రేజీ అప్డేట్స్ ఇస్తున్నారు మేకర్స్..ఒకొక్క గ్లింప్స్ ను విడుదల చేస్తూ సినిమాపై మంచి అంచనాలను క్రియేట్ చేశారు మేకర్స్. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్ ను విడుదల చేశారు. ఈ టీజర్ ఆసక్తికరంగా కట్ చేశారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో వెంకీ తన కామెడీతో మరోసారి ఆకట్టుకోనున్నారని టీజర్ చూస్తే అర్థమవుతుంది. అలాగే ఈ టీజర్ లో వెంకీ కుటుంబం కోసం కష్టపడటం, భార్య అప్పులు చేయడం, ఆతర్వాత వెంకీకి లాటరీ తగలడం, కట్ చేస్తే లైఫ్ చేంజ్ అయిపోవడం చూపించారు. అంతలోనే తన ఫ్యామిలీకి ప్రమాదం రావడంతో హీరో యాక్షన్ మోడ్ లోకి దిగడం చూపించారు. టీజర్ చూస్తుంటే కథ సింపుల్ గా సాగిపోతుందని కానీ సినిమాలో ఉండే ఫన్ ఆకట్టుకుంటుందని టీజర్ చూస్తే అర్థమవుతుంది. ఈ సినిమాపై మొదటి నుంచి మంచి క్యూరియాసిటి నెలకొంది. ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఆదర్శకుటుంబం సినిమా టీజర్ పై మీరూ ఓ లుక్కేయండి.

# దర్శకుడిగా మారిన రామ్.. హీరోయిన్‌గా పాప్యులర్ నటి!

రామ్ పోతినేని హీరోయిన్‌గా సంయుక్త
తొలిసారి దర్శకత్వం కూడా వహిస్తున్న హీరో రామ్
సంయుక్త పుట్టినరోజున చిత్రబృందం అధికారిక ప్రకటన
సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతున్న సినిమా
రామ్ సోదరుడు కృష్ణ పోతినేని భారీ బడ్జెట్‌తో నిర్మాణం



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కథానాయకుడిగా నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఐ=ఖాషూ23'. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే ఉత్కంఠకు చిత్రబృందం తెరదించింది. ప్రముఖ నటి సంయుక్తను కథానాయికగా ఎంపిక చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం సంయుక్త పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రకటన వెలువడటం విశేషం.సంయుక్తకు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేస్తూ, ప్రాజెక్ట్‌లోకి ఆమెను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు మేకర్స్ ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. రామ్, సంయుక్త జంటగా నటిస్తున్న తొలి చిత్రం కావడంతో ఈ నూతన కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని ఒక వినూత్నమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు.నియో-నోయర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రానికి సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నారు. రామ్ సోదరుడు కృష్ణ పోతినేని భారీ బడ్జెట్‌తో సైకలాజికల్ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటివరకు కనిపించని సరికొత్త అవతార్‌లో రామ్ ఈ సినిమాలో అలెక్ట్‌లోకి ఆమెను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు మేకర్స్ ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. రామ్, సంయుక్త జంటగా నటిస్తున్న తొలి చిత్రం కావడంతో ఈ నూతన కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని ఒక వినూత్నమెరించనున్నారని, నటుడిగానే కాకుండా దర్శకుడిగా కూడా ఈ చిత్రం ఆయన కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుందని చిత్ర వర్గాలు వెల్లడించాయి.

# లైంగికంగా వేధించాడని యువతి ఫిర్యాదు.. డాన్స్ మాస్టర్ రాజు అరెస్ట్ !



ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, డి-10 డ్యాన్స్ షో విజేత రాజు లైంగిక వేధింపుల కేసులో అరెస్టు అయ్యాడు. ఓ యువతి చేసిన ఫిర్యాదు ఆధారంగా మియాపూర్ పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అవకాశాలు ఇప్పిస్తానంటూ తనను లైంగికంగా వేధించాడని, ఆ తర్వాత మోసం చేశాడని ఆ యువతి మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆరోపణల తీవ్రత దృష్ట్యా డ్యాన్స్ మాస్టర్ రాజును అరెస్టు చేసి, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన టాలీవుడ్, డ్యాన్స్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒక ప్రముఖ డ్యాన్స్ మాస్టర్‌పై ఇలాంటి ఆరోపణలు రావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. పోలీసులు ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# నా సినిమాలను నేను చూడలేను



ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె 'వైబ్' అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు 'బట్వారా 1947' చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. 'వైబ్'లో ఆమె 'మేడమ్ హెచ్' అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు 'ఇంపాస్టర్ సిండ్రోమ్' అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు 'చేయగలనా, లేదా?' అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. "నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగాసెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు 'ఇంపాస్టర్ సింద్రో ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది" అని ప్రీతి వెల్లడించింది.